మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 209 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad



## ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో కీలక కమాండర్‌లు మృతి



- సిట్టింగ్ జడ్జీతో విచారణ జరిపించాలి పౌరహక్కుల సంఘం నేతల డిమాండ్
మృతుల ఫొటోలు, వివరాలను బయటపెట్టాలి
- ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌పై పౌరహక్కుల నేతల డిమాండ్

రాయపూర్ (ప్రజా మంటలు):
ఛత్తీస్‌గఢ్‌లో శుక్రవారం చోటుచేసుకున్న భారీ ఎన్‌కౌంటర్‌పై పౌర హక్కుల సంఘాల నేతలు స్పందించారు. మృతుల ఫొటోలు, వివరాలను పోలీసులు వెంటనే విడుదల చేయాలని ఏపీ పౌర హక్కుల సంఘం కోరింది. ఈ ఘటనపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారించాలని డిమాండ్ చేసింది. నిన్నటి ఎన్‌కౌంటర్‌లో ఇప్పటివరకు 31 మంది మావోయిస్టుల మృతదేహాలను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. మృతుల్లో మావోయిస్టు కార్యదర్శి నంబళ్ల కేశవరావు, దండకారణ్య రాష్ట్ర కమిటీ సభ్యుడు తక్కళ్లపల్లి వాసుదేవ రావు, అమరేశ్ అలియాస్ రామకృష్ణ, నీతి అలియాస్ ఊర్మిళ ఉన్నట్లు సమాచారం. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశంలో భద్రతా బలగాలు భారీ ఎత్తున కూంబింగ్ చేపడుతున్నాయి.



### మూసీ నిర్వాసితుల జీవనోపాధి కోసం ప్రత్యేక కమిటీ

హైదరాబాద్, (ప్రజా మంటలు):
మూసీనది ప్రక్షాళనలో భాగంగా నిర్వాసిత కుటుంబాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే నదీగర్భంలో నివాసాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు రెండు పడకల గదుల ఇళ్లను కేటాయిస్తున్న ప్రభుత్వం.. విద్య, ఉపాధి కల్పన

మిగతా 2లో..

# అనాథలను చేయం

## మూసీ పరీవాహక ప్రాంత ప్రజలు ఆందోళన చెందొద్దు

- విపక్షాల మాటలు నమ్మొద్దు
- వారిని అన్ని విధాలుగా ఆదుకుంటాం
- రాజకీయ పబ్బం గడుపుకునే వారిని నమ్మొద్దు
- పేదల కోసం చర్చించడానికి సిద్ధంగా ఉన్నాం
- రుణమాఫీ కాలేదని రోడ్డెక్కొద్దు
- రూ.2 లక్షల రుణమాఫీ చేసి తీరుతాం
- కాకా జయంతి సభలో సిఎం రేవంత్ రెడ్డి





హైదరాబాద్, (ప్రజా మంటలు):
మూసి నిర్వాసితులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, వారికి అన్ని విధాలుగా అండగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. నిర్వాసితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం వారందరినీ ఆదుకుంటుందన్నారు. ఎవరినీ అనాథలను చేయబోమన్నారు. ప్రత్యామ్నాయం చూపిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాదు.. ఎవరైనా వచ్చి రెచ్చగొడితే వారి మాటలను నమ్మొద్దని, వారి ఫామ్ హౌజ్‌లను కాపాడుకోవడానికే డ్రామాలాడుతున్నారని సీఎం విమర్శించారు. అలాగే రైతు రుణామాఫీ కాని వారు కలెక్టరేట్లోఓ దరఖాస్తు చేయాలన్నారు. రెండు లక్షలపైగా ఉన్న రుణాల్లో పై మొత్తం చెల్లిస్తే ప్రబుత్వం 2లక్షలు చెల్లిస్తుందని అన్నారు. ఇంత కచ్చితంగా చెబుతున్నా బిఆర్ఎస్, బిజెపిలు రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకుంటున్నాయని అన్నారు. రైతులు వారిని నమ్ముకుంటే నట్టేట ముంచుతారని గుర్తుంచుకోవాలన్నారు. శనివారం నాడు కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి(కాకా) జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..మూసీ నిర్వాసితులకు భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు. మూసీ నిర్వాసితులు అధైర్యపడొద్దని.. ప్రత్యామ్నాయం చూపిస్తామన్నారు. మూసీ బాధితులకు అండగా ఉన్నట్లు మాట్లాడే వారంతా పేదలకు ఏం చేద్దామో.. వారిని ఎలా ఆదుకుందామో చెప్పాలని కోరారు. ఇళ్లు ఇద్దామా.. డబ్బులు ఇద్దామా.. ప్రభుత్వ స్థలాలు ఇద్దామా.. అని విపక్ష నేతలను సీఎం ప్రశ్నించారు. హైదరాబాద్ నగరాన్ని నీటి ప్రమాదం నుంచి కాపాడాలని.. ప్రజల మంచి కోసమే ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. మూసీ దగ్గర ఉన్న వాళ్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కాళేశ్వరంలో ఒక్క కుటుంబమే లక్ష కోట్లు మింగిందంటూ కేసీఆర్ కుటుంబం టార్గెట్‌గా తీవ్ర ఆరోపణలు చేశారు. మూసి బాధితులు అందరిని ఆదుకోవడానికి పట్టుమని రూ. పదివేల కోట్లు కూడా కావన్నారు. పేదల కోసం పదివేల కోట్లు ఖర్చు పెట్టడానికి ప్రభుత్వం వెనుకాడబోదన్నారు. ఈటెల



రాజేందర్, కేటీఆర్, హరీష్ రావు సచివాలయానికి రావాలని.. ప్రజలకు ఏం చేద్దామో చర్చిద్దామని సీఎం రేవంత్ పిలుపునిచ్చారు. మూసీ విషంతో బతుకుతున్న నల్లగొండను ఎలా ఆదుకోవాలో చర్చిద్దామన్నారు. ఇలాగే వదిలేసి మూసీని మూసేద్దామా? అని ప్రశ్నించారు. ప్రధాని మోదీ సబర్మతి రివర్ ఫ్రంట్ కోసం 64 వేల కుటుంబాలను తరలించారని.. కేవలం 16వేల కుటుంబాలకే పరిహారం ఇచ్చారని

మిగతా 2లో..



## మీకిదే చివరి అవకాశం

- సుప్రీం కోర్టు అల్టిమేటం
- వలస కార్మికులపై ఇంత నిర్లక్ష్యమా!
- వారికి కార్డుల జారీలో జాప్యం చేస్తున్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలపై ధర్మాసనం అసహనం
- నవంబరు 19లోగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
రేషన్ కార్డుల కోసం ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న వలస కార్మికులకు కార్డుల జారీలో జాప్యం చేస్తున్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. రాష్ట్రాల తీరు ఆందోళనకరమని, ఈ విషయంలో తమకు ఇక ఓపిక నశించిందని పేర్కొంది."ఈ అంశంలో ఎలాంటి ఉదాసీనతకు చోటు లేదని మరోసారి స్పష్టంగా చెబుతున్నాం. ఇక మాకు ఓపిక నశించింది. మా ఉత్తర్వులను పాటించేందుకు మీకు చివరి అవకాశం ఇస్తున్నాం. లేదంటే మీ కార్యదర్శులు కోర్టుకు రావాల్సి ఉంటుంది" అని సుప్రీంకోర్టు ధర్మాసనం హెచ్చరించింది. ఈ వ్యవహారంపై నవంబరు 19లోగా కేంద్రం, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తగిన చర్యలు తీసు కోవాలని స్పష్టం చేసింది.కొవిడ్ సమయంలో వలస కార్మికులు ఎదుర్కొన్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని.. సర్వోన్నత న్యాయస్థానం 2020లో దీనిపై సుమోటోగా విచారణ చేపట్టింది. ఈ క్రమంలోనే జాతీయ ఆహార భద్రత చట్టం కింద

మిగతా 2లో..

## రుణమాఫీ చేయకపోతే పంచాయతీ ఎన్నికల్లో గుణపాఠం చెబుతారు

### కేటీఆర్ విమర్శలు



వార్తా 2లో..

### పాలిట్రిక్స్

పొలిటికల్ ఉచ్చులో 'సిని'మా ప్రముఖులు, మైలేజీ కారకేనోయి అంటున్నరు పెద్దలు !

దిగివచ్చి మంత్రిగారు చెప్పినా క్షమాపణలు, ససేమిరా అంటూ 'పరువు' నష్టం దావాలు !

- న్యాలకంటి నారాయణ
9346200066

## హర్యానా జమ్మూలో కాంగ్రెస్‌దే హవా

- ఎగ్జిట్‌పోల్ ఫలితాల వెల్లడి
- ప్రజలు కాంగ్రెస్ వైపే మొగ్గ

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
హర్యానాలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేసే అవకాశం ఉందని ఎగ్జిట్ పోల్ సర్వేలు ప్రకటించాయి. పీపుల్స్ పల్స్ సర్వే ప్రకారం.. కాంగ్రెస్- 55, బీజేపీ- 26, ఐఎన్ఎల్డీ 2-3, జేజేపీ 0-1, ఇండిపెండెంట్లు 3-5 స్థానాలు గెలిచే అవకాశం ఉంది. హర్యానాలో మొత్తం 90 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. అధికారం చేపట్టాలంటే 46 సీట్లు కైవసం చేసుకోవాలి. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ ఆధిక్యంలో ఉన్నట్లు పీపుల్స్ పల్స్ ప్రకటించింది. తన ప్రత్యర్థి బీజేపీపై 7 నుంచి 8 శాతం ఓట్ల ఆధిక్యత ప్రదర్శించే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేసింది. పీపుల్స్ పల్స్ సర్వే ప్రకారం.. హర్యానాలో కాంగ్రెస్ పార్టీకి 45 శాతం, బీజేపీకి 38 శాతం, ఐఎన్ఎల్డీ-బీఎస్పీ కూటమికి 5.2 శాతం, ఆప్ పార్టీకి 1 శాతం, జేజేపీకి 1 శాతం లోపు, ఇతరులకు 10 శాతం ఓట్లు వచ్చే అవకాశం ఉంది. సీఎం ఎవరైతే బాగుంటుందన్న అంశంపైనా ప్రజలు తమ అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టారు. కాంగ్రెస్ వైపే మొగ్గు చూపారు. సీఎల్పీ లీడర్ భూపీందర్ సింగ్ హూడాకు 39 శాతం, సిట్టింగ్ సీఎం నయాబ్ సింగ్ సైనీకి 28 శాతం, కాంగ్రెస్ ఎంపీ కుమారీ సెల్జాకు 10 శాతం, కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌కు 6 శాతం మంది ఈ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి కావాలని మద్దతిస్తున్నారని పీపుల్స్‌పల్స్ పేర్కొంది. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పోటీ జాతీయ పార్టీలు బీజేపీ, కాంగ్రెస్ మధ్యే ఉంటుందని పీపుల్స్ పల్స్ సర్వే పేర్కొంది. ప్రాంతీయ పార్టీలు ఇండియన్ నేషనల్ లోక్‌దళ్, జననాయక్ జనతా పార్టీలు బలహీనపడ్డాయని సర్వే నివేదికలో పేర్కొంది. ఈ ఎన్నికల్లో స్థానిక అంశాలు ప్రభావితం చేశాయని అంచనా వేసింది. స్థానిక ఎమ్మెల్యే పనితీరు, మౌలిక సదుపాయాల



కల్పన, స్థానిక సమస్యల ఆధారంగా ప్రజలు ఓటు వేశారని పీపుల్స్ పల్స్ తెలిపింది. ఓటర్లు జాతీయ అంశాలకు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో ప్రధాని మోదీ ప్రభావం ఈ ఎన్నికల్లో కనిపించలేదు. వీటికి తోడు.. నిరుద్యోగం, అగ్నివీర్ పథకం, రైతు సమస్యలు, ధరల పెరుగుదల.. హర్యానాలో ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. పదేళ్ల ప్రభుత్వ వ్యతిరేకతకు తోడుగా రాష్ట్రంలో రైతులు, రెజ్లర్లు, యువత బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నట్టు పీపుల్స్ పల్స్ సర్వేలో వెల్లడయింది.

మిగతా 2లో..




## హరియానాలో పోలింగ్ ప్రశాంతం

- ఎన్నికల్లో ఓటేసిన ప్రముఖులు

చండీగఢ్ (ప్రజా మంటలు):
హరియాణా అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సమయం ముగిసింది. రాష్ట్రంలోని మొత్తం 90 స్థానాల్లో 1,031 మంది అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. శనివారం ఉదయం 7 గంటలకు ఓటింగ్ పక్రియ ప్రారంభమైంది. సాయంత్రం 5 గంటల నాటికి దాదాపు 61 శాతం పోలింగ్ నమోదైనట్లు సమాచారం. ఈ నెల 8న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో 68 శాతం ఓటింగ్ నమోదైంది. పదేళ్లుగా రాష్ట్రాన్ని పాలిస్తున్న భాజపా.. హ్యాట్రిక్ కొట్టాలని ఉవ్విళ్లూరుతోంది. అయితే.. దీర్ఘకాలంగా అధికారంలో ఉండటంతో ప్రజల్లో పెరిగిన వ్యతిరేకతతోపాటు కుల సమీకరణాలు ఆ పార్టీకి ఈసారి ప్రతికూలంగా మారే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. జాట్‌లు, ఎస్సీల మద్దతుతో కాంగ్రెస్‌లో జోష్ నెలకొంది. ఆ రెండు వర్గాలూ ప్రస్తుతం మాజీ ముఖ్యమంత్రి భూపీందర్‌సింగ్ హుడా నేతృత్వంలోని హస్తం పార్టీకి అనుకూలంగా ఉన్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. పారిస్ ఒలింపిక్స్ డబుల్ పతకాలు సాధించిన స్టార్ షూటర్ మను బాకర్, హరియాణా ముఖ్యమంత్రి, భాజపా అభ్యర్థి నాయబ్ సింగ్ సైనీ, కేంద్రమంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, కృషణ్ పాల్ గుర్జార్, గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్, మాజీ రెజ్లర్, కాంగ్రెస్ అభ్యర్థి వినేశ్ ఫొగాట్, మాజీ ఉప ముఖ్యమంత్రి దుశ్యంత్ చౌటాలా, భారత సంపన్న మహిళ, స్వతంత్ర అభ్యర్థి సావిత్రి జిందాల్ తదితర ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు.

## ప్రజా నాడి





## తప్పులు చేస్తూ తలవంచి నమస్కరించడమేంటి?

- భాజపా ప్రభుత్వం ప్రజలను భయపెట్టడంతో పాటు రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తోంది
- ప్రధానిపై రాహుల్ విమర్శలు



ముంబయి (ప్రజా మంటలు):
భాజపా ప్రభుత్వం ప్రజలను భయపెట్టడంతో పాటు రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు.మహారాష్ట్ర లోని కొల్హాపూర్‌లో ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు.సింధుదుర్గ్ జిల్లాలోని రాజ్‌కోట్ కోటలో 35 అడుగుల శివాజీ విగ్రహం కుప్పకూలిన ఘటనను ఉద్దేశిస్తూ.. భాజపా సర్కార్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. "ప్రజలను భయపెడుతూ, రాజ్యాంగాన్ని, ఆయా సంస్థలను నాశనం చేస్తూ.. ఇప్పుడు ఛత్రపతి శివాజీ ఎదుట తలవంచి నమస్కరించడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదు. శివాజీ అందించిన సందేశం దేశమంతటికీ వర్తిస్తుంది. ఛత్రపతి, షాహూ మహరాజ్ లాంటి యోధులు లేకపోయి ఉంటే.. నేడు మనకు రాజ్యాంగం ఉండేది కాదు" అని ప్రధాని మోదీ ని ఉద్దేశిస్తూ రాహుల్ వ్యాఖ్యానించారు. కాగా.. భారీ వర్షాల కారణంగా ఈ ఏడాది ఆగస్టులో రాజ్‌కోట్ కోటలో 35 అడుగుల శివాజీ విగ్రహం కుప్పకూలిన సంగతి తెలిసిందే. ఈ ఘటన రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. నాణ్యతా లోపం కారణంగా విగ్రహం కూలిపోయిందంటూ రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు చేశాయి. ఈ ఘటన చోటుచేసుకున్న తర్వాత రాష్ట్రంలో పర్యటించిన ప్రధాని మోదీ.. శివాజీకి తల వంచి క్షమాపణలు తెలియజేశారు. మనకు ఈ దైవం కంటే గొప్పది ఏమీ లేదన్నారు. తాజాగా కొల్హాపూర్‌లో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన రాహుల్.. నాడు ప్రధాని ప్రసంగాన్ని ఉద్దేశిస్తూ తీవ్ర విమర్శలు గుప్పించారు.

మొదటి పేజీ తరువాయి

# అనాథలను చేయం

**మూసీ పరీవాహక ప్రాంత ప్రజలు ఆందోళన చెందొద్దు**

సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు. అలాంటిదే హైదరాబాద్‌లో మూసీ రివర్ ఫ్రంట్ చేస్తే ఈటెల రాజేందర్‌కు వచ్చిన ఇబ్బంది ఏంటని ప్రశ్నించారు.బీఆర్ఎస్ పార్టీ అకౌంట్‌లో రూ. 1,500 కోట్లు ఉన్నాయని.. అందులోంచి మూసీ బాధితులకు రూ. 500 కోట్లు ఇవ్వాలని సీఎం రేవంత్ డిమాండ్ చేశారు. ఈ డబ్బులను మూసీ నిర్వాసితులకు పంచిపెడదా మన్నారు. గజ్వేల్‌లో కేసీఆర్‌కు వెయ్యి ఎకరాలు ఉందని.. అందులోకి 500 ఎకరాలు దానం చేస్తే పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తానని సీఎం అన్నారు. కేటీఆర్‌కు జన్వాడలో 50 ఎకరాల ఫామ్ హౌజ్ ఉందని.. అందులో 25 ఎకరాలు ఇవ్వాలన్నారు. 'ఇవన్నీ దోచుకున్నవే కదా? మీ తాతల నుంచి వచ్చినవి కాదు కదా 2009 నుంచి మీ ఆస్తులు ఎలా పెరుగుతూ వచ్చాయి.' అని కేటీఆర్‌ను సీఎం రేవంత్ ప్రశ్నించారు. రేస్ కోర్సు బయటకు తరలిద్దామని.. అంబర్‌పేటలో ఉన్న పోలీస్ అకాడమీని బయటకు తరలిద్దామన్న సీఎం.. అందులో పేదలకు ఇళ్లు కట్టిద్దామని చెప్పారు. పేదలకు న్యాయం చేయడానికి ఒక కమిటీని వేస్తామని.. అందులో ఈటెల రాజేందర్, కేటీఆర్, హరీష్ రావు, పొన్నం ప్రభాకర్‌ను సభ్యులుగా నియమిస్తామన్నారు. పేదల బాధ తనకు తెలుసునని.. ఏ పని చేసినా అడ్డుపడొద్దని రేవంత్ విజ్ఞప్తి చేశారు. కేటీఆర్ దీక్షపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. రెండు లక్షల వరకు ఉన్న రైతులందరికీ రుణమాఫీ చేశామని సీఎం పునరుద్ఘాటించారు. రెండు లక్షలపైన రుణం ఉన్న వారికి.. పైన డబ్బులు కడితే మిగతావి ఇస్తామని చెప్పామన్నారు. రుణమాఫీ జరగలేదని కేటీఆర్ దీక్ష చేపట్టారని విమర్శించారు. రెండు లక్షల పైనున్న వాళ్లకు మాత్రమే రుణమాఫీ జరగలేదని సీఎం వివరించారు. రైతులు ఎవరూ వీరిని నమ్మొద్దని హితవు చెప్పారు రేవంత్. ఏమైనా సమస్యలుంటే కలెక్టర్‌ను కలిసి అడగాలని.. సమస్యను పరిష్కరిస్తారన్నారు. సోషల్ మీడియాతో అధికారంలోకి వస్తామని బీఆర్ఎస్ నాయకులు కలలు కంటున్నారని.. చిల్లర పనులు చేస్తే చర్లపల్లి జైలుకు వెళతారని చురకలంటించారు సీఎం. ఇదే సమయంలో చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌కు మంత్రి పదవిపై సీఎం రేవంత్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల్లో వెంకట స్వామి కుటుంబం పాత్ర ఖచ్చితంగా ఉంటుందన్నారు. అంతేకాదు.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పక్రియ మరుగున పడొద్దని కాకా ఆలోచించారన్నారు. సోనియాగాంధీ, ప్రణబ్ ముఖర్జీని ఒప్పించి టీఆర్ఎస్‌తో పొత్తు కుదిర్చారన్నారు. టీఆర్ఎస్‌కు 42 ఎమ్మెల్యే, 5 ఎంపీ సీట్లు ఇప్పించడానికి ప్రధాన కారణం కాకా నే అని అన్నారు. కాకా వల్లనే ఆనాడు బీఆర్ఎస్(టీఆర్ఎస్) బలపడిందన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత అసూయతో కాకాను వదిలేశారని సీఎం విమర్శించారు. మల్లిఖార్జున ఖర్గే సూచనతో వివేక్ వెంకటస్వామిని తిరిగి కాంగ్రెస్‌లోకి తీసుకువచ్చానని రేవంత్ రెడ్డి చెప్పారు. వెంకటస్వామి సూచన మేరకే ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు చేపట్టారని.. తుమ్మిడి హట్టి వద్ద ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును నిర్మిస్తామని స్పష్టం చేశారు. కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మన కళ్లముందే కట్టడం, కూలిపోవడం కూడా జరిగిందని సీఎం విమర్శించారు.

## మీకిదే చివరి అవకాశం

కోటాతో సంబంధం లేకుండా.. ఈ-శ్రమ్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న దాదాపు 8 కోట్ల వలస కార్మికులకు రేషన్ కార్డులు జారీ చేయాలని 2021లో అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. అయితే, ఇప్పటివరకు కొన్ని రాష్ట్రాలు మాత్రమే ఈ ప్రక్రియను పూర్తి చేయగా.. మిగతా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు జాప్యం చేస్తున్నాయి. దీంతో సుప్రీంకోర్టు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది.

## మూసీ నిర్వాసితుల జీవనోపాధి కోసం ప్రత్యేక కమిటీ

కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సెర్ప్ సీఈవో ఛైర్మన్‌గా, జీహెచ్ఎంసీ కమిషనర్ వైస్ ఛైర్మన్‌గా 14 మంది సభ్యులతో జీవనోపాధి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ దాన కిషోర్ కన్వీనర్‌గా ఉన్న ఈ కమిటీలో మైనార్టీ, మహిళా శిశు సంక్షేమ శాఖ, ఎస్సీ, బీసీ సంక్షేమశాఖతోపాటు పాఠశాల విద్య కమిషనర్, తెలంగాణ గురుకుల పాఠశాలల కార్యదర్శులు సభ్యులుగా ఉంటారని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ కమిటీలోని సభ్యులు..తమ తమ శాఖలకు సంబంధించిన కార్యాచరణను రూపొందించి 30 రోజుల్లోగా ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించింది.

## హర్యానా జమ్మూలో కాంగ్రెస్‌దే హవా

ఎగ్జిట్ పోల్స్‌లో కాంగ్రెస్ పార్టీకే హర్యానా ప్రజలు పట్టం గట్టినట్లు చెబుతున్నాయి. పీపుల్స్ పల్స్ ఎగ్జిట్ పోల్స్ ప్రకారం.. హర్యానాలో ప్రధాన పోటీ జాతీయ పార్టీలు బీజేపీ, కాంగ్రెస్ మధ్యే ఉంది. ప్రాంతీయ పార్టీలు ఇండియన్ నేషనల్ లోక్ దళ్, జననాయక్ జనతా పార్టీలు బలహీనపడ్డాయి-. ఈ ఎన్నికల్లో స్థానిక అంశాలు కీలకపాత్ర పోషించాయి. స్థానిక ఎమ్మెల్యే పనితీరు, మౌలిక సదుపాయాల కల్పన, స్థానిక సమస్యల ఆధారంగా ప్రజలు ఓటు వేశారని -పీపుల్స్ పల్స్ వెల్లడించింది. ఓటర్లు జాతీయ అంశాలకు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో ప్రధాని మోదీ ప్రభావం ఈ ఎన్నికల్లో కనిపించలేదు. నిరుద్యోగం, అగ్నివీర్ పథకం, రైతు సమస్యలు, ధరల పెరుగుదల.. హర్యానాలో ప్రధాన సమస్యలుగా ఉన్నాయి-. పదేళ్ల ప్రభుత్వ వ్యతిరేకతకు తోడుగా రాష్ట్రంలో రైతులు, రెజ్లర్లు, యువత బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నట్టు పీపుల్స్ పల్స్ సర్వేలో వెల్లడయింది.

జమ్మూకశ్మీర్ ఎగ్జిట్ పోల్స్..

దాదాపు పదేళ్ల తర్వాత జరిగిన జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకి మెజారిటీ సీట్లు రాబోవని సర్వే సంస్థలు అంచనా కట్టాయి.నేషనల్ కాన్ఫరెన్స్- కాంగ్రెస్ కూటమికి ఎక్కువ సీట్లు వస్తాయని చెప్పినప్పటికీ.. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సీట్లకు అటూ ఇటుగా సీట్లు వస్తాయని అంచనా వేశాయి. భాజపాకు కనిష్ఠంగా 20 గరిష్ఠంగా 32 స్థానాలు వస్తాయని పేర్కొన్నాయి. మెహబూబా ముఫ్తీకి చెందిన పీడీపీ సింగిల్ డిజిట్‌కు పరిమితం కానుందని సర్వే సంస్థలు అంచనా వేశాయి. జమ్మూకశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దు, రాష్ట్ర హోదా తొలగించిన తర్వాత నిర్వహించిన ఎన్నికలు కావడంతో దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. మొత్తం 90 స్థానాలకు గానూ మూడు విడతల్లో ఎన్నికలు జరిగాయి. ఫలితాలు అక్టోబర్ 8న వెలువడనున్నాయి. ప్రభుత్వ ఏర్పాటుకు 46 స్థానాలు అవసరం. 2014లో జరిగిన ఎన్నికల్లో ఏ పార్టీకీ సరైన మెజారిటీ రాకపోవడంతో భాజపా, పీడీపీ ఉమ్మడిగా ప్రభుత్వం ఏర్పాటు చేశాయి. ఈ సారి ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు వేర్వేరుగా పోటీ చేశాయి. ఇండియా కూటమిలోని కాంగ్రెస్, ఎన్సీ పొత్తుతో బరిలోకి దిగాయి.

సర్వే సంస్థల అంచనాలు ఇలా..

జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్- కాంగ్రెస్ కూటమి 46-50 స్థానాలు సాధించొచ్చని పీపుల్స్ పల్స్ రీసెర్చ్ సంస్థ అంచనా వేసింది. భాజపా- 23-27 స్థానాలు; పీడీపీ 7-11 స్థానాలు; ఏఐపీ 0-1, ఇతరులు 4-5 స్థానాలు గెలిచే అవకాశాలున్నట్లు తెలిపింది. కూటమిలో నేషనల్ కాన్ఫరెన్స్ 33-35, కాంగ్రెస్ 13-15 స్థానాలు గెలిచే అవకాశం ఉందని పేర్కొంది. జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రిగా ఎవరికి ప్రాధాన్యం ఇస్తారని సర్వేలో కోరగా మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లాకు సుమారు 28 శాతం మంది మద్దతిచ్చారని సర్వే సంస్థ వెల్లడించింది. మిగిలిన వారంతా ఆయనకు చాలా దూరంలో నిలవడం గమనార్హం.పీడీపీ -28, భాజపా -25, కాంగ్రెస్ -12, ఎన్సీపీకి - 15, ఇతరులు -7 సీట్లు గెలుచుకుంటారని రిపబ్లిక్ మ్యాట్రిజ్ సంస్థ అంచనా వేసింది.పీడీపీ 4-7, భాజపా 20-25, కాంగ్రెస్-ఎన్సీ కూటమి- 35-40, ఇతరులు 12-16 గెలుచుకోవచ్చని దైనిక్ భాస్కర్ పేర్కొంది.నేషనల్ కాన్ఫరెన్స్- కాంగ్రెస్ కూటమికి 40-48 సీట్లు రావొచ్చని ఇండియాటుడే- సీఓటర్ సర్వే అభిప్రాయపడింది. భాజపాకు 27-32, పీడీపీకి 6-12, ఇతరులకు 6-11 సీట్లు వస్తాయని అంచనా వేసింది.యాక్సిస్ మై ఇండియా సర్వే సంస్థ సైతం నేషనల్ కాన్ఫరెన్స్- కాంగ్రెస్‌కు 35-45 సీట్లు వస్తాయని అంచనా వేసింది. భాజపాకు 24-34, పీడీపీ 4-6, ఇతరులకు 8-23 సీట్లు రావొచ్చని తెలిపింది.

# రుణమాఫీ చేయకపోతే పంచాయతీ ఎన్నికల్లో గుణపాఠం చెబుతారు - కేటీఆర్ విమర్శలు

హైదరాబాద్, (ప్రజా మంటలు):

కాంగ్రెస్.. రైతు రుణ మాఫీ ఎగ్గొట్టి, మూసీలో మురికి రాజకీయాలు చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రైతు రుణమాఫీ పేరుతో అధికారంలోకి వచ్చి ఆ పార్టీ మోసం చేసిందన్నారు. రైతు బంధు ఎగ్గొట్టి, మూసి పేదల ఉసురు పోసుకుంటున్న దుర్మార్గుడు ఎవరు?.. మహిళలకు వంద రోజుల్లోనే నెలకు రూ.2,500 ఇస్తా అని చెప్పి తప్పించుకు తిరుగుతున్న మోసగాడు ఎవరు?.. అవ్వ, తాతలకు నెలకు రూ.4 వేలు ఇస్తా అని చెప్పి ఎగ్గొట్టిన నయవంచకుడు ఎవరు?.. ఆడబిడ్డల పెళ్లిళ్లకు తులం బంగారం ఇస్తా అని మాట తప్పిన దగావీరుడు ఎవరు? .. మూసీ సుందరీకరణ పేరుతో రూ.లక్ష 50 వేల కోట్ల లూటిఫికేషన్‌కు తెరతీసిన ఘనుడు ఎవరు? అంటూ కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. బతుకమ్మ పండుగ వేళ గ్రామాల్లో చెరువు వద్ద లైట్లు పెట్టడానికి, పరిశుభ్రత కోసం బ్లీచింగ్ పౌడర్ కొనడానికి డబ్బుల్లేని పరిస్థితులు వచ్చాయని కేటీఆర్ అన్నారు. బతుకమ్మ అంటే గిట్టదా..పట్టదా ఈ ముఖ్యమంత్రికి? ఆడబిడ్డల వేడుకకు ఏర్పాట్లు చేయడానికి మనసురాట్లేదా? పండుగపూట కూడా పల్లెలను పరిశుభ్రంగా ఉంచలేరా? చెత్తా చెదారం మధ్య మురికి కంపులో మన అక్కా చెల్లెళ్లు బతుకమ్మ ఆడుకోవాల్నా? పంచాయతీల్లో బ్లీచింగ్ పౌడర్ కొనడానికి.. చెరువు కట్టమీద లైట్లు పెట్టడానికి పైసల్లేని పరిస్థితులు దాపురించాయి. రాష్ట్ర పండుగను ఘనంగా నిర్వహించు కునేందుకు నిధుల్లేని దౌర్భాగ్యం ఎందుకొచ్చింది..? తెలంగాణ అస్తిత్వ సంబురంపై ఎందుకింత నిర్లక్ష్యం..? ప్రకృతిని పూజించే విశిష్ట పండుగను.. స్వచ్ఛమైన పరిసరాల్లో జరుపుకునే భాగ్యం కూడా లేదా మహిళలకు? బతుకమ్మ చీరలను ఇవ్వలేదు. ఇప్పుడు బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా చేసుకోవాల్సిన అవసరం లేదని చెబుతున్నారా..?' అని కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు.

రైతులను మోసం చేసి ఆగం పట్టించారు

దిక్కుమాలిన మాటలు,రోతపుట్టించే మాటలు మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, ఆయన మంత్రివర్గాన్ని విడిచిపెట్టే ప్రసక్తే లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కూడా త్వరలోనే పరువు నష్టం దావా వేస్తానని కేటీఆర్ తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని కందుకూరులో మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు ధర్నాలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. దిక్కుమాలిన నోటలు, రోత పుట్టించే మాటలు మాట్లాడే ముఖ్యమంత్రిని విడిచిపెట్టం. నీ గబ్బు మాటలకు నీ మంత్రుల చెడ్డ మాటలకు సమాధానం చెబుతాం.ఇక నుంచి వదిలిపెట్టం. నాపై ఆరోపణలు చేసిన మంత్రిపై ఆల్రెడీ పరువు నష్టం దావా వేశాను. ముఖ్యమంత్రి మీద కూడా తొందర్లనే వేస్తా.. అడ్డగోలుగా మాట్లాడిన మంత్రిగారిని విడిపెట్టను.. క్షమాపణ చెప్పేదాకా వదిలిపెట్టను. అటు క్రిమినల్, ఇటు సివిల్ డిఫమేషన్ రెండు సూట్లు వేస్తాను.. వదిలిపెట్టే ప్రసక్తే లేదు. తప్పే చేయనప్పుడు ఎవని అయ్యకు కూడా భయపడం. ఏం చేసుకుంటవో చేస్కో అని మోదీకే చెప్పినం. ఈ చిట్టి నాయుడు ఎంత మనకు.. అడ్డిమారి గుడ్డి దెబ్బలో సీఎం అయిండు. ఇక ఆగుతలేడు. పెద్దోని అయిపోయానని రేవంత్ రెడ్డి అనుకుంటున్నాడు అని కేటీఆర్ మండిపడ్డారు. సబితక్క ముగ్గురు కొడుకులకు ఫామ్ హౌస్‌లు ఉన్నాయట. మరి అవి ఎక్కడున్నాయో చెబితే మేమే కూలగొడుతాం. సబితక్క బిడ్డకు కూడా ఉందట. అది కూడా చూపిస్తే కూలగొడుతాం. మాట్లాడితే కూలగొడుతా అంటున్నావ్.. అది నీ ఇష్టం. రేవంత్ రెడ్డి నీ కళ్లు చల్లబడుతాయి అనుకుంటే.. మావి కూలగొట్టి అక్కడికి ఆపేయ్. పేదవాళ్లవి మాత్రం కూలగొట్టకు.. వారి ఇండ్లను ముట్టుకోవడం బంద్ చేయ్. ఇవాళ రాష్ట్రంలో పరిస్థితులు చూస్తుంటే బాధ అనిపిస్తుంది. ఒక దిక్కేమో రైతు గోస.. హైదరాబాద్ పోతే మూసీ బాధితుల రోదన. మూసీ పరివాహక ప్రాంతంలో 50 ఏండ్ల నుంచి ఇల్లు కట్టుకుంటే ఆక్రమణదారులు, కబ్జాదారులు అంటున్నాడు రేవంత్ రెడ్డి. మీ కాంగ్రెస్ ప్రభుత్వమే రిజిస్ట్రేషన్లు చేసే.. ఇన్ని రోజులు పైసలు దొబ్బితింటివి. ఇప్పుడేమో కబ్జాకోరులు అని మాట్లాడుతున్నావు. నీకు చిత్తశుద్ధి ఉంటే.. కొడంగల్‌లోని రెడ్డి కుంటలో నీ సొంత ఇల్లు ఉంది.. దమ్ముంటే దాన్ని కూలగొట్టి.. పేదోళ్ల వద్దకు రా అని సవాల్ చేస్తున్నా. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న మీ అన్న తిరుపతి రెడ్డి ఇల్లు కూలగొట్టు. అప్పటికీ కడుపు మంట చల్లారకంటే మావి కూలగొట్టు.. కానీ పేదల ఇండ్ల వద్దకు రావొద్దని కేటీఆర్ చెప్పారు. నీకు పైసలు, కమిషన్లు కావాలి. రాహుల్ గాంధీకి పంపాలి.. కుర్చీ కాపాడుకోవాలి. నీ బాధ అర్థమవుతుంది. నీకు అంత పైసల పిచ్చి ఉంటే.. నాలుగు కోట్ల మందిమి చందాలు వేసుకునే నీ ముఖాన కొడుతాం. కానీ పేదల ఇండ్లు కూలగొట్టకు.. చందా పైసలను తీసుకెళ్లి ఢిల్లీకి కప్పం కట్టి.. ముఖ్యమంత్రి పదవి కాపాడుకో అని కేటీఆర్ సూచించారు.



ఇకపోతే మూసీ గబ్బంతా ముఖ్యమంత్రి, మంత్రుల నోట్లోనే ఉందని కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిలా పని చేయడం లేదు.. రియల్ ఎస్టేట్ బ్రోకర్‌లా వ్యవహరిస్తున్నాడని కేటీఆర్ మండిపడ్డారు. రేవంత్ ప్రభుత్వం ఈ పది నెలల్లో కొత్తగా సాధించింది ఏం లేదు.. కానీ రెండు జరుగుతున్నాయి. మూసీ సుందరీకరణ కోసం లక్షా 50 వేల కోట్లు ఖర్చు పెడుతా అంటుండు. రైతుబంధు, ఆసరా పెన్షన్లు, రుణమాఫీకి పైసల్లేవట. కానీ లక్షా 50 వేల కోట్లు మూసీలో పోస్తాడట. ఎందుకో తెలుసా..? రైతుబంధు, పెన్షన్లు, తులం బంగారం ఇస్తే మీరు కమిషన్ ఇవ్వరు. కానీ అదే మూసీలో 30 వేల కోట్లు దొబ్బి ఢిల్లీకి మూటలు పంపాలి. అందుకు మూసీ పథకం పెట్టిండు. కేసీఆర్ కాళేశ్వరం కట్టిండు, పాలమూరు 90 శాతం కట్టిండు. నీళ్లు ఇచ్చేందుకు కట్టిండు. మరి మూసీతో ఎన్ని ఎకరాలకు నీళ్లు ఇస్తావు?? సమాధనం ఉందా..? అంటే లేదు. కమిషన్లు దొబ్బేందుకు ఎ÷-లాన్ చేస్తున్నాడు రేవంత్ రెడ్డి. ఆయనకు కమిషన్ల పిచ్చి పట్టింది. పేదవాళ్లకు సంక్షేమ పథకాలు అమలు చేస్తే పైసలు రావు.. కాబట్టి మూసీ పేరు మీద బ్యూటిఫికేషన్ కాకుండా లూటిఫికేషన్ చేస్తే కాంగ్రెసోళ్లకు డబ్బులు పంపి.. కుర్చీని కాపాడుకునేందుకు రేవంత్ రెడ్డి యత్నిస్తున్నాడని కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో 14 వేల ఎకరాలు ఫార్మా సిటీకి సేకరించాం. ఇదే కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, భట్టి విక్రమార్క, కోదండ రెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి, రేవంత్ రెడ్డి ఊరురు తిరిగి చెప్పిండ్రు.. బస్సు యాత్రలు పెట్టి చెప్పిండ్రు.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఫార్మా సిటీ రద్దు చేసి తిరిగి రైతులకు భూములు ఇస్తామన్నారు. కానీ మాట మార్చారు. ఫార్మా సిటీ పేరు మార్చి ఫోర్త్ సిటీ అని పెట్టిండు. ఇంకోటి ఫ్యూచర్ సిటీ అట. ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగంలో రాష్ట్ర ప్రభుత్వమే పనులు చేస్తదట. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నియోజకవర్గంలో కమిషన్లు, కాంట్రాక్టుల కోసం అలైన్‌మెంట్ మార్చి తమ భూములను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ బ్రోకర్‌లా పని చేస్తున్నాడు.. ముఖ్యమంత్రిలా పని చేయడం లేదు.. మాట్లాడితే మూసీ, హైడ్రా అంటున్నాడు. చేయాల్సింది మూసీ సుందరీకరణ కాదు.. మూసీ గబ్బంతా ముఖ్యమంత్రి, మంత్రుల నోట్లనే ఉంది. వాళ్ల నెత్తుల నిండా గబ్బు ఉన్నదని కేటీఆర్ విమర్శించారు.

# యువతకు డ్రగ్స్ ఉచ్చులో పడేస్తున్నారు

**- ఆ సొమ్ముతో కాంగ్రెస్ ఎన్నికల్లో పోటీ చేస్తోంది**

**- మోదీ ఆరోపణలు**

ముంబయి (ప్రజా మంటలు):



ప్రధాని నరేంద్రమోదీ కాంగ్రెస్ పార్టీపై మండిపడ్డారు. డ్రగ్స్ సొమ్ముతో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో పోటీ చేస్తోందని విమర్శించారు. ఇటీవల దిల్లీలో రూ.వేల కోట్ల విలువైన డ్రగ్స్ పట్టివేత కేసులో ఓ కాంగ్రెస్ నేత ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో శనివారం మహారాష్ట్రలోని వాసింలో నిర్వహించిన సభలో పాల్గొన్న ప్రధాని ఈ డ్రగ్స్ కేసు గురించి ప్రస్తావించారు. యువతను కాంగ్రెస్ పార్టీ మాదకద్రవ్యాల వైపు నెట్టి.. ఆ సొమ్ముతో ఎన్నికల్లో పోటీ చేసి గెలవాలని భావిస్తోందని ఆరోపించారు.కాంగ్రెస్‌ను అర్బన్ నక్సల్స్ ముఠా పాలిస్తోందని..ఆ పార్టీ ప్రమాదకరమైన అజెండాను ఓడించేందుకు ప్రజలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. భారత్‌కు వ్యతిరేకంగా వ్యవహరించే వ్యక్తులతో కాంగ్రెస్ ఎంత సన్నిహితంగా ఉంటుందో ప్రజలు గమనించాలని అన్నారు. బ్రిటిష్ పాలకుల మాదిరిగా కాంగ్రెస్ కూడా దళితులు, వెనుకబడిన వర్గాలు, గిరిజనులను తమతో సమానంగా పరిగణించదని దుయ్యబట్టారు. భారతదేశాన్ని ఎప్పటికీ ఒకే కుటుంబం పాలించాలని వారు భావిస్తారని ఆరోపించారు.మహారాష్ట్ర పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ స్థానికంగా ఉన్న జగదాంబ మాత ఆలయంలో పూజలు చేశారు. అనంతరం సంత్ సేవా లాల్ మహారాజ్ సమాధి వద్దకు వెళ్లి సంప్రదాయ ఢంకా వాయించారు. బంజారా విరాసత్ మ్యూజియాన్ని ప్రారంభించారు. అంతే కాకుండా ముంబయిలో మొట్టమొదటి భూగర్భ మెట్రో లైన్‌ను ప్రారంభించారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి (ఖఓ-ఐమోంఐ) పథకం కింద 18వ విడత నిధులు విడుదల చేశారు. దీని ద్వారా సుమారు 9.4 కోట్ల మంది రైతులకు సుమారు రూ.20,000 కోట్ల సహాయం అందింది.

# లెబనాన్‌పై ఆగని ఇజ్రాయెల్ దాడులు..

**- హమాస్ కీలక నేత,ఆయన కుటుంబసభ్యులు మృతి**

బీరూట్(జనంసాక్షి):

ఇజ్రాయెల్- హెజ్‌బొల్లాల మధ్య భీకర దాడులు కొనసాగుతున్నాయి. ఈనేపథ్యంలో ఇజ్రాయెల్ తాజాగా జరిపిన వైమానిక దాడుల్లో హమాస్‌కు చెందిన కీలక నేత, ఆయన కుటుంబసభ్యులు మృతి చెందినట్లు సమాచారం.ఉత్తర లెబనాన్‌లో ట్రిపోలిలోని పాలస్తీనా శరణార్థుల శిబిరంపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు జరిపింది. ఈ దాడుల్లో హమాస్‌కు చెందిన అల్ ఖసమ్ బ్రిగేడ్ సాయుధ విభాగంలో సభ్యుడైన సయీద్ అతల్లా మృతి చెందారు. ఈ దాడుల్లో అతల్లాతో పాటు ఆయన ముగ్గురు కుటుంబసభ్యులు సైతం మరణించినట్లు సమాచారం. ఈమేరకు హమాస్‌కు చెందిన పలు మీడియా వర్గాలు ఉటంకిస్తున్నాయి. మరోవైపు ఇజ్రాయెల్‌కు చెందిన పలు వార్తాసంస్థలు సైతం ఇదే విషయాన్ని ధృవీకరించాయి. హమాస్ మిలిటెంట్ గ్రూపుల్లోని మరో అగ్ర నాయకుడు మరణించారనేది అందులోని సారాంశం.ఇక, లెబనాన్‌లో ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇప్పటివరకు 2 వేల మందికిపైగా మృతి చెందినట్లు పలు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. అందులో 250 మంది హెజ్‌బొల్లాకు చెందినవారు ఉండటం గమనార్హం. బీరుట్‌లోని ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో హెజ్‌బొల్లా చీఫ్ హసన్ నస్రల్లా మరణించిన విషయం తెలిసిందే. దీంతో ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రతీకారంగా 180 క్షిపణులతో విరుచుకుపడింది. ఈ దాడులకు ప్రతీకారం తీర్చుకుంటామని ఇజ్రాయెల్ సైతం పేర్కొంది.




## హైడ్రా ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం

హైదరాబాద్, (ప్రజా మంటలు): హైదరాబాద్ విపత్తు స్పందన, ఆస్తుల పర్యవేక్షణ, పరిరక్షణ ఏజెన్సీ(హైడ్రా)కు విస్తృత అధికారాలు కల్పిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌కు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలిపారు. ఈ మేరకు శనివారం రాజ్‌భవన్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో ఇకపై హైడ్రా చేపట్టబోయే అన్ని కార్యకలాపాలకు చట్టబద్ధత లభించింది. ఈ చట్టాన్ని రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టి ఆమోదించనున్నట్లు తెలుస్తోంది. జీహెచ్‌ఎంసీ చట్టంలో కొత్తగా 374(బీ) సెక్షన్‌ను చేర్చుతూ ఆర్డినెన్స్ జారీ అయింది. జలాశయాలు, రోడ్లు, పార్కులు, ఇతర ఆస్తులు కాపాడే బాధ్యత అప్పగించారు. అధికారి లేదా ఏజెన్సీకి అప్పగించే అధికారం ప్రభుత్వానికి కల్పిస్తూ ఆర్డినెన్స్ జారీ అయింది.

## త్వరలో తెలంగాణ నుంచి ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతి

### - మంత్రి ఉత్తమ్




హైదరాబాద్, (ప్రజా మంటలు): తెలంగాణ నుంచి ఫిలిప్పీన్స్‌కు త్వరలో బియ్యం ఎగుమతి చేయనున్నామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పౌర సరఫరాల భవన్ నుంచి ఫిలిప్పీన్స్ ఆహార, వ్యవసాయ శాఖ మంత్రి రోజేర్స్‌తో ఉత్తమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నాణ్యత పరమైన కారణాల వల్ల గత కొన్నేళ్లుగా భారత్ నుంచి ఫిలిప్పీన్స్ బియ్యం దిగుమతి చేసుకోవడం లేదనే విషయం ప్రస్తావనకు వచ్చిందని మంత్రి అన్నారు. తెలంగాణలో ధాన్యం దిగుబడులు గణనీయంగా పెరగడంతో పాటు నాణ్యత మెరుగుపడినందున బియ్యం ఎగుమతిపై చర్చలు జరుపుతున్నట్లు చెప్పారు.

## తిరుమలలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

### ఆకట్టుకుంటున్న కళాబృందాల ప్రదర్శనలు

తిరుమల,అక్టోబర్5 (ప్రజా మంటలు): తిరుబమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. వరుసగా రెండోరోజు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇకపోతే బ్రహ్మోత్సవాల్లో కళాబృందాల ఆటపాటలు వర్ణనాతీతం. మాడవీధుల్లో వారు స్వామి ఊరేగింపు ముందు చేసే విన్యాసాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. మొదటి రోజైన శుక్రవారం రాత్రి పెద్ద శేష వాహన సేవలో టీటీడీ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో నిర్వహించిన కళా బృందాల ప్రదర్శనలు భక్తులకు ఆధ్యాత్మికానందం కలిగించాయి. వివిధ ప్రాంతాలకు చెందిన 14 కళాబృందాలలో 410 మంది కళాకారులు ప్రదర్శనలిచ్చారు. ఒరిస్సాకు చెందిన ఒడిస్సీ నృత్యం, తమిళనాడుకు చెందిన లతారవి ఆధ్వర్యంలో మయూర నృత్యం, కేరళ రాష్ట్రానికి చెందిన వీణ బృందం యక్షగానం, కర్నాటక కళా రూపమైన వీరగాశను చేతన్ బృందం అద్భుతంగా ప్రదర్శించారు. శ్రీకాకుళం నుండి శ్రీమతి దుర్గా భవానీ, తిరుమల నుండి శ్రీనివాసులు, రాజమండ్రి నుండి శ్రీసురేష్ బాబు, తిరుపతి బాలమందిర్ విద్యార్థులు కోలాటాలతో మంత్ర ముగ్ధులను చేశారు. హైదరాబాదుకు చెందిన శ్రీమతి లక్ష్మీదేవి బృందం ఒగ్గడోలుతోను, తిరుపతికి చెందిన డాక్టర్ మురళీకృష్ణ బృందం మోహినీయట్టంతోను, కర్నాటకకు చెందిన శ్రీమతి వనీష బృందం పటకునిత కళా విన్యాసం, శ్రీ రవికుమార్ చిలిపిలి గొంబె నృత్యం, శ్రీ నాగేంద్ర బృందం కంసాలి రూపకంతో తమ అద్భుతమైన ప్రదర్శనలతో భక్తులకు నయనానందాన్ని కలిగించారు. ఇదిలావుంటే తిరుమల శ్రీవారి ఆలయంలో శుక్రవారం సాయంత్రం ధ్వజారోహణంతో సాలకట్ల బ్రహ్మోత్సవాలకు వైభవంగా నాంది పలికారు. తొలిరోజు రాత్రి శ్రీదేవి, భూదేవి సమేతంగా మలయప్పస్వామి పెద్దశేష వాహనంలో నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. అంతకుముందు ఆలయంలో నిత్యపూజాదికాల అనంతరం ప్రధాన అర్చకులు వరుసగా శ్రీదేవి, భూదేవి, మలయప్ప, ఇతర దేవతలు, కంకణ భట్టాచార్యులైన గోవిందాచార్యులు, టీటీడీ ఈవో శ్యామలరావుకు కంకణ ధారణ చేశారు. మధ్యాహ్నం 3గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిని బంగారు తిరుచ్చిలో మాడవీధుల్లో ఊరేగించారు. ధ్వజపటాన్ని కూడా ఊరేగిస్తూ బ్రహ్మోత్సవాలకు దేవతలందరికీ ఆహ్వానం పలికారు. సాయంత్రం 5.45- 6గంటల మధ్య మీనలగ్నంలో ధ్వజారోహణ నిర్వహించడంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీవారికి సిఎం చంద్రబాబు దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు.

# కంపుకొడుతున్న మూసీ రాజకీయాలు !

తెలంగాణలో మూసీ రాజకీయాలు కొనసాగుతున్నాయి. మురికి కంపు కొట్టిస్తున్నాయి. చివరకు జుగుపస కలిగిస్తున్నాయి. పరస్పర విమర్శలు, బజార్ భాష వాడడం గతంలో ఎప్పుడూ లేనంతగా వినిపిస్తోంది. రాజకీయనాయకులు దిగజారి పోయారు. ముఖ్యంగా కొండా సురేఖ వ్యాఖ్యలతో చిత్రపరిశ్రమ ఎన్నడూ లేనంతంగా ఆక్రందన చెందింది. అలాగే కెటిఆర్‌పై సురేఖ చేసిన వ్యాఖ్యలు, సోషల్ మీడియా పోస్టులు గమనిస్తే రాజకీయాలు ఎంతగా దిగజారి పోయాయో అర్థం చేసుకోవచ్చు. ఇకపోతే మూసీ అభివృద్ధి పేరుతో ప్రభుత్వం చేపట్టిన పనులు విపక్షాలకు అస్త్రంగా మారింది. మూస ఈప్రాజెక్టును విపక్ష బిజెపి, బిఆర్‌ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ప్రభుత్వం కూడా మిగతా ప్రాధాన్యాలను వదిలేసి కేవలం మూసీ, హైడ్రాలనే ప్రధానంగా ఎంచుకున్నది. నిరుద్యోగ సమస్యకు చెక్ పెట్టడం, ధరలపై చర్యలు తీసుకోవడం, మంచినీటి సమస్యను తీర్చం వంటి అనేకానేక సమస్యలు వేధిస్తున్నా పట్టించుకోవడం లేదు. కాంగ్రెస్ మంత్రులు కూడా తలాతోక లేకుండా మాట్లాడేస్తున్నారు. మూసీ సుందరీకరణ పేరుతో కాంగ్రెస్ సర్కార్ చేపట్టిన ప్రాజెక్టుపై ప్రజా వ్యతిరేకత పెరుగుతోంది. బాధితులకు అండగా బిఆర్‌ఎస్, బిజెపి నేతలు నిలిచారు. వారికి మద్దతుగా పోరాడుతున్నారు. బాధితులు కూడా మూసీని వదిలి వచ్చేందుకు ఇష్టపడడం లేదు. దాదాపు రెండున్నర దశాబ్దాలుగా మూసీ ఆక్రమణలకు గురవుతూనే ఉంది. ఈ ప్రాజెక్టును చేపట్టడం ఆహ్వానించదగ్గ పరిణామమే. కానీ ప్రజలకు ఆమోదయోగ్యంగా ప్రణాళిక ఉండాలి. ఈ క్రమంలో అధికార, విపక్షాల మధ్య మాటలతూటాలు పేలుతున్నాయి. విమర్శలు హద్దులు దాటుతున్నాయి. ఈ సమస్య తీవ్రం కాకముందే తాత్కాలికంగా మూసీ ప్రాజెక్టును పక్కన పెట్టి చర్చించాలని పలువురు మేధావులు సైతం సూచించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొత్తలో నాటి కెసిఆర్ ప్రభుత్వ అవినీతిపై కాంగ్రెస్ ఫోకస్ పెట్టింది. అప్పులు, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాలు బాగా బయటకు వచ్చాయి. వీటిపైనే దృష్టి పటెట్ఇ ఉంటే బాగుండేది. ఈ రెండు విషయాలు ప్రభుత్వ ప్రాధాన్యం నుంచి తప్పుకున్నట్లు తెలుస్తోంది. కేవలం ఇప్పుడంతా మూసీ ప్రాజెక్ట్‌పై రాజకీయం నడుస్తోంది. ఓ రకంగా చెప్పాలంటే సీఎం రేవంతే ప్రతిపక్ష బీఆర్‌ఎస్,బిజెపిలకు ఆయుధాలు అందిస్తున్నారని అన్నారు. మూసీతో విపక్షాలు గట్టిగానే వినిపిస్తున్నాయి. సిఎం రేవంత్ కూడా ఏమాత్రం దూకుడు తగ్గించుకోవడానికి సిద్దంగా లేరు. హైదరాబాద్‌లో హడలెత్తిస్తున్న హైడ్రా, మూసీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న ఇళ్లపై బుల్డోజర్ల వంటి కార్యక్రమాలపై ఇప్పుడు సమీక్షించుకోవాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ నిర్ణయాలు ఎప్పుడైనా ప్రజామోదంగానే ఉండాలి. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని ఆరోపిస్తున్న కాంగ్రెస్ నేతలు అందుకు కారకులైన మాజీ సీఎం కేసీఆర్‌ను, బిఆర్‌ఎస్ నేతలను ఇరికిస్తారని ప్రచారం జరిగింది. అయితే అలాంటిదేఈ లేదని తేలపోయింది. ప్రభుత్వ ఆర్థిక వనరులు, ప్రజాభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోకుండా సిఎం రేవంత రెడ్డి మాట్లాడుతున్నారు. ఇకపోతే కాంగ్రెస్ రుణమాఫీ కూడా ఎదురుదిరుగుతోంది. కాంగ్రెస్ రూ.2 లక్షల రుణమాఫీ చేసిందని ప్రభుత్వం అంటోంది. అయితే జరగలేదని విపక్షం అంటోంది. ఈ వజషయంలో విపక్షబీఆర్‌ఎస్‌కు కాంగ్రెస్సే ఆయుధం సమకూర్చినట్లైంది. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇబ్బడిముబ్బడిగా హామీలిచ్చిందని వాటిని అమలు చేయడం లేదని బిజెపి, బిఆర్‌ఎస్ నేతలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అటు హైడ్రా, మూసీ, ఇటు రైతు రుణమాఫీ తదితర పనులతో కొంత ప్రజా వ్యతిరేకత మొదలైందని చెప్పాలి. ఇకపోతే ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దివంగత మాజీ సీఎం రాజశేఖర్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ స్వేచ్ఛ ఇచ్చిందని , కానీ రేవంత్ విషయంలో అది జరగడం లేదని అంటున్నారు. మంత్రులు ఎవరికి వారే ముఖ్యమంత్రులుగా వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ చేస్తున్న తప్పిదాలు బీఆర్‌ఎస్‌కు అందివచ్చిన అవకాశంలా మారాయి. తమది నిర్మాణాత్మక ప్రభుత్వం అయితే కాంగ్రెస్‌ది కూల్చివేతల ప్రభుత్వం అంటూ కెటిఆర్ విమర్శలు గుప్పిస్తు న్నారు. ఎన్నికల వరకు ఊపుమీదున్న బీజేపీ ప్రధాన ప్రతిపక్షంగా ఎదగలేకపోతోంది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై హైకోర్టులో కేసులు వెన్నాడుతున్నాయి. మరోవైపు మూసీ కూల్చివేతలు, సర్వే నిర్వాసితుల్లో దడ పుట్టిస్తున్నది. తహసీల్దార్ల బృందం మూసీ పరీవాహక ప్రాంతాల్లో సంచరిస్తూ నిర్వాసితులను ఒప్పించే యత్నం చేస్తున్నది. ఆ బృందాలను చూస్తేనే అక్కడి జనం వణికిపోతున్నారు. విడదసీ.. తరలించు అన్నట్టుగా ఒక్కో బృందం కొన్ని కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని వారిని ఖాళీ చేయించే చర్యలకు పాల్పడుతున్నది. తమంతట తాము ఖాళీ చేస్తే రూ.25 వేల పారితోషకం ఇస్తామంటూ ఆశ చూపిస్తున్నారు. కానీ చాలామంది తమ గూడును వదలడానికి అంగీకరించడంలేదు. కొంతమంది పెద్ద దిక్కులేని వాళ్లు భయంగానే అంగీకరించినట్టు చెప్తున్నారు. చాలామంది డబ్బులు పెట్టి జాగాలు కొనుక్కొని ఇండ్లు కట్టుకున్నారు. మూసీ బాధితులు మొత్తంగా రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నది. విపక్షాలు తోడు కావడంతో ఇప్పుడు పరిస్థితి చేజారి పోయే ప్రమాదం ఏర్పడింది. మూసీ సుందరీకరణను ఎవ్వరూ తప్పు పట్టడం లేదు. హైదరాబాద్ అభివృద్ధికి మూసీ సుందరీకరణ కూడా తోడవ్వాలి. అయితే అది విమర్శలకు దారితీయకుండా ప్రశంతంగా సాగితే అందరికీ మంచిది. అలాగే ప్రజా సంక్షేమ కార్యక్రమాలు కూడా ముమ్మరంగా సాగాలి. దెబ్బతిన్న రోడ్లు బాగు చేయడంలో ముందుకు రావడం లేదు. ఈ విషయంలో తోణ చర్యలు తీసుకోవాల్సి ఉంది.

# తిరుమలలో విఐపి సంస్కృతి తగ్గాలి

- విఐపిల కోసం అనవసర హడావిడి చేయరాదు
- ఆధ్యాత్మికత ఉట్టిపడేలా పరిసరాలు ఉండాలి
- తిరుమల పవిత్రత పెంచి..నమ్మకం కలిగించాలి
- ప్రశాంతతకు భంగం వాటిల్లకుండా చూసుకోవాలి
- భవిష్యత్ నీటి అవసరాలకు తగ్గట్లుగా ప్రణాళికలు చేయాలి
- కొండల్లో అటవీప్రాంత విస్తీరణం పెరిగేలా చేయండి
- భక్తుల ఫిర్యాదులు, అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలి
- తిరుమల అధికారులతో సిఎం చంద్రబాబు సమీక్ష





తిరుమల,అక్టోబర్5 (ప్రజా మంటలు): తిరుమలలో వీఐపీ సంస్కతి తగ్గాలని సీఎం చంద్రబాబు టీటీడీని అదేశించారు. ప్రముఖులు వచ్చినప్పుడు హడావుడి కనిపించకూడదన్నారు. సింపుల్‌గా, ఆధ్యాత్మిక ఉట్టిపడే పరిసరాలు ఉండాలి తప్ప ఆర్భాటం, అనవసర వ్యయం వద్దని సూచించారు. తిరుమల పవిత్రత, నమ్మకం కాపాడేలా ప్రతి ఒక్కరూ పని చేయాలని చంద్రబాబు హితవు పలికారు. తిరమలలోని పద్మావతి అతిథి గృహంలో టీటీడీ అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి, టీటీడీ ఈవో శ్యామల రావు, అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి సహా ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఈ సమీక్షలో టీటీడీ అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు పలు సూచనలు చేశారు. కొండపై గోవింద నామస్మరణ తప్ప మరో మాట వినిపించకూడదని గట్టిగా చెప్పారు. ప్రశాతంతకు ఎక్కడా భంగం కలగకూడదన్న చంద్రబాబు.. ఏ విషయంలో కూడా రాజీ పడొద్దని ఆదేశించారు. ఈ మధ్య కాలంలో జరిగిన రాజకీయ హడావుడిని దృష్టిలో పెట్టుకొని చంద్రబాబు ఈ సూచన చేసినట్టు కనిపిస్తోంది. భవిష్యత్ నీటి అవసరాలకు తగ్గట్లు నీటి లభ్యత ఉండేలా చూసుకోవా లని తిరుమల తిరుపతి దేవస్థాన అధికారులను అప్రమత్తం చేశారు చంద్రబాబు. ముందస్తు ప్రణాళికు సిద్ధం చేయాలన్నారు. అటవీ ప్రాంతాన్ని 72 నుంచి 80 శాతంపైగా పెంచాలని అధికారులకు సూచించారు అటవీ సంరక్షణతోపాటు అడవుల విస్తరణ కోసం వచ్చే 5 ఏళ్లకు ప్రణాళికు రూపొందించాలని అన్నారు. బయోడైవర్సిటీ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. టీటీడీ సేవలపై భక్తుల నుంచి స్పందన తీసుకునే విధానంపై సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. వచ్చిన ప్రతి భక్తుడు తమ అనుభవాలపై అభిప్రాయాలు చెప్పే అవకాశం కల్పించాలన్నారు. భక్తుల సూచనలు, సలహాల ఆధారంగా సేవలపై టీటీడీ పనిచేయాలని అప్‌డేట్ చేస్తూ ఉండాలని సూచించారు. ఒక్క టీటీడీలోనే కాకుండా అన్ని దేవాలయాల్లో భక్తుల అభిప్రాయాలు తీసుకునే విధానం తీసుకురావాలని మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డిని ఆదేశించారు. లడ్డూ ప్రసాదం, అన్న ప్రసాదం నాణ్యత పెరిగిందని భక్తులు చెబుతున్నారన్న చంద్రబాబు...ఎల్లప్పుడూఇది కొనసాగాలని ఆదేశించారు. మరింత మెరుగుపడేలా చూడాలన్నారు. ప్రసాదాల తయారీలో వాడే పదార్థాల నాణ్యత బాగుండేలా చూడాలన్నారు. అత్యుత్తమ పదార్థాలు మాత్రమే వాడాలని సూచించారు. టీటీడీ సిబ్బంది భక్తుల పట్ల గౌరవంగా వ్యవహరించాలన్న సీఎం... దేశ విదేశాల నుంచి వచ్చేవారు హ్యాపీగా వెళ్లేలా చూడాలన్నారు. దురుసు ప్రవర్తన అనేది ఎక్కడా ఉండకూడదని హెచ్చరించారు. భక్తులు సంతృప్తితో, అనుభూతితో కొండ నుంచి తిరిగి వెళ్లాలని హితవు పలికారు. తిరుమల పేరు తలిస్తే ఏడుకొండల వాడి వైభవం, ఆధ్యాత్మిక మాత్రమే చర్చకు రావాలన్నారు. స్విమ్స్ సేవలు కూడా మెరుగుపరచాలన్నారు. ఇదొక ప్రత్యేకమైన క్షేత్రమని... తిరుమల పవిత్రత కాపాడడం, ఆధ్యాత్మిక విషయంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ సమీక్ష అనంతరం తిరుమలలో వకుళమాత సెంట్రలైజ్డ్ కిచెన్ ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం అక్కడ కూడా అధికారులకు పలు సూచనలు చేశారు. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు, తిరుమల వెంకటేశ్వర స్వామికి పూర్వ వైభవం తీసుకొస్తామని ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఎన్టీఆర్ హయాంలో తిరుమలలో అన్నదానం ప్రారంభమైందని గుర్తుచేశారు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా నిత్యం మూడు లక్షల మందికి అన్నదానం చేస్తున్నామని వివరించారు. తిరుమల గిరుల్లో గోవింద నామాలే వినిపించాలని అధికారులకు స్పష్టం చేశారు. తిరుమల పవిత్రత, నమ్మకం కాపాడేలా పనిచేయాలని అధికారులకు కీలక సూచనలు చేశారు. తిరుమల కొండపై గోవింద నామస్మరణ తప్ప మరో మాట వినిపించకూడదని స్పష్టం చేశారు. తిరుమల తిరుపతిలో ప్రశాతంతకు భంగం కలగకూడదు తేల్చి చెప్పారు. భక్తుల మనోభావాలకు సంబంధించి ఏ విషయంలోనూ రాజీ పడొద్దని కుండబద్దలు కొట్టారు. తిరుమలలో అందిస్తోన్న సేవలపై భక్తుల నుంచి స్పందన గురించి అధికారులను సీఎం చంద్రబాబు అడిగారు. తిరుమల వచ్చిన ప్రతి భక్తుడి అనుభవాల గురించి అభిప్రాయం చెప్పే అవకాశం కల్పించాలని సూచించారు. భక్తుల సలహాలు, సూచనలతో మరింత మెరుగ్గా సేవలు అందించొచ్చని పేర్కొన్నారు. ఒక్క తిరుమలలోనే కాక మిగతా ఆలయాల్లో కూడా భక్తుల అభిప్రాయం తీసుకునేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డికి సూచించారు. తిరుమల లడ్డూ ప్రసాదం, అన్న ప్రసాదం నాణ్యత పెరిగిందని భక్తులు అంటున్నారు. ఇది ఇలానే కొనసాగాలి, సేవలు మరింత మెరుగుపడాలని సీఎం చంద్రబాబు అభిప్రాయ పడ్డారు. ప్రసాదాల తయారీలో వాడే పదార్థాల నాణ్యత బాగుండేలా చూడాలని కోరారు. ఉత్తమ పదార్థాలు మాత్రమే వాడాలని స్పష్టం చేశారు. భవిష్యత్ అవసరాలకు తగినట్టు నీటి లభ్యత ఉండేలా చూసుకోవాలి. నీటి కోసం ముందస్తు ప్రణాళిక చాలా అవసరం. అటవీ ప్రాంతాన్ని 72 నుంచి 80 శాతంపైగా పెంచాలి. అటవీ సంరక్షణతో పాటు అడవుల విస్తరణ కోసం వచ్చే ఐదేళ్లకు ప్రణాళికతో పనిచేయాలి. బయోడైవర్సిటీ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యల ఏంటని అధికారులను సీఎం చంద్రబాబు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## జయమ్ము నిశ్చయమ్మురా

ఎప్పుడూ ఒప్పుకోవద్దురా ఓటమి
ఎప్పుడూ వదులుకోవద్దురా ఓరిమి
నింగి ఎంత గొప్పదైనా
రివ్వుమన్న గువ్వపిల్ల రెక్కముందు
తక్కువేనురాజి
సంద్రమెంత పెద్దదైన
ఈదుతున్న చేపపిల్ల మొప్ప ముందు
చిన్నదేనురాజి

నొప్పి లేని నిమిషమేది.?
జననమైనా మరణమైనా..
జీవితాన అడుగడుగునా
నీరసించి నిలిచిపోతే
నిమిషమైనా నీది కాదురా..

బ్రతుకు అంటే నిత్య ఘర్షణ
విశ్రమించవద్దు
ఏ క్షణం
విస్మరించవద్దు
ఏ నిర్ణయం
అప్పుడే..
నీ జయం నిశ్చయంరా..

రచన:
దీగోజు శ్రీలక్ష్మి, జనగామ

## చెరువు కబ్జా చేసిన ఎన్ కన్వెన్షన్ నిర్మాణం

### నాగార్జునపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి

### మాదాపూర్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు

హైదరాబాద్, (ప్రజా మంటలు): అక్కినేని నాగార్జున పై మాదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేశారు. తమ్మిడికుంట చెరువు కబ్జాచేసి ఔకన్వెన్షన్ నిర్మించారని పోలీసులకు ఫిర్యాదు అందింది. మాదాపూర్ పోలీసులకు జనం కోసం అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కరరెడ్డి ఫిర్యాదు చేశారు. నాగార్జునపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని భాస్కరరెడ్డి పోలీసులను కోరారు. లీగల్ ఒపీనియన్‌కు పంపించారు మాదాపూర్ పోలీసులు. నాగార్జునకు చెందిన ఔ కన్వెన్షన్‌ను ఇటీవలే కూల్చివేసిన విషయం తెలిసిందే. చెరువును కబ్జా చేసి ఔ కన్వెన్షన్ నిర్మించారని హైడ్రా దాన్ని కూల్చివేసింది. తుమ్మిడికుంట చెరువులో 3 ఎకరాల 30 గుంటల భూమిని ఆక్రమించి ఔ కన్వెన్షన్ కట్టారని ఎప్పటి నుంచో ఆరోపణలు ఉన్నాయి. కాగా దాని పై హైడ్రాకు మరోసారి ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదులు పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్.. చెరువు ఆక్రమణకు గురైనట్టు నిర్ధారించి..కూల్చివేతలకు ఆదేశాలు ఇచ్చారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య.. జంబో జేసీబీలతో కన్వెన్షన్‌ను గంటల వ్యవధిలోనే అధికారులు కూల్చివేశారు.
కాగా దీని పై నాగార్జున స్పందిస్తూ.. ఆ భూమి పట్టా భూమి అని.. ఒక్క అంగుళం ట్యాంక్ ఎ÷-లాన్ కూడా ఆక్రమణకు గురికాలేదన్నారు.. ప్రైవేట్ స్థలంలో నిర్మించిన భవనమిదని.. కూల్చివేత కోసం గతంలో ఇచ్చిన అక్రమ నోటీసుపై స్టే కూడా మంజూరు చేసినట్లు నాగార్జున తెలిపారు. తాజాగా ఇప్పుడు మరోసారి నాగ్ పై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు కసిరెడ్డి భాస్కరరెడ్డి. మరి దీని పై నాగార్జున ఎలా స్పందిస్తారో చూడలి. మరోవైపు మంత్రి కొండా సురేఖ సమంత, అక్కినేని ఫ్యామిలీ పై కామెంట్స్ చేసిన విషయం తెలిసిందే. దాంతో కొండా సురేఖ పై నాగ్ లీగల్ యాక్షన్ కు సిద్ధమయ్యారు.

## రాజేంద్రప్రసాద్ ఇంట్ తీవ్ర విషాదం

### గుండెపోటుతో కన్నకూతురు మృతి

హైదరాబాద్, (ప్రజా మంటలు): సీనియర్ హీరో, విలక్షణ నటుడు రాజేంద ప్రసాద్ ఇంట్లో విషాదం చోటు చేసుకుంది. రాజేంద్ర ప్రసాద్ కూతురు గాయత్రి గుండ పోటు తో కన్నుమూశారు. కార్డియాక్‌అరెస్ట్ కావడంతో శుక్రవారం హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తరలిం చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శని వారం మరణించారు. కన్నా కూతురు మరణం తో రాజేంద్ర ప్రసాద్ కుటుంబం విషాదంలో మునిగిపోయింది. నటుడిగా ఉన్నత స్థానానికి ఎదిగారు. క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా కెరీర్ మొదలు పెట్టి ఆ తర్వాత హీరోగా మారి మెప్పించారు. ఎన్నో అద్భుతమైన సినిమాలను తెలుగు ప్రేక్ష కులకు అందించారు. రాజేంద్ర ప్రసాద్ ముక్కు సూటి మనిషి. ఏదైనా మొహం మీదే చెప్పే యడం ఆయన నైజం.. రాజేంద్ర ప్రసాద్ పర సనల్ లైఫ్ గురించి ఎక్కువ మందికి తెలియదు.

# కోరుట్లలో ఘనంగా వెంకటస్వామి జయంతి వేడుకలు

కోరుట్ల అక్టోబర్ 05 (ప్రజామంటలు):
బలహీనవర్గాల ఆశాజ్యోతి, ఇల్లు లేని నిరుపేదలకు గూడును చూపించిన దళిత నేత గడ్డం వెంకటస్వామి 95వ జయంతి సందర్భంగా శనివారం జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చౌరస్తాలో వెంకటస్వామి చిత్రపటానికి ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వెంకట స్వామి గూడు లేని నిరుపేదల కోసం వారి గూడు కోసం పోరాడి, గుడిసెలను వేయించి ఆయన ఇంటి పేరే గుడిసెల వెంకటస్వామిగా మార్చుకున్నారన్నారు. కార్మిక, ప్రజా సమస్యల పరిష్కారం కోసం, పేద ప్రజల అభ్యున్నతి కోసం, జీవితాంతం పోరాటం చేసిన మహెూన్నతమైన వ్యక్తి వెంకటస్వామి అని అన్నారు. ఆయన ఐదుసార్లు ఎంపీగా, కేంద్ర మంత్రిగా, పిసిసి అధ్యక్షునిగా పనిచేసి కాంగ్రెస్ పార్టీకి ఎంతో పేరు తెచ్చారు. ఆయన ఏ పదవి చేపట్టిన ఏ పదవికైనా వన్నె తెచ్చారని అన్నారు. దేశంలోనే కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆయన ఎంతో కృషి చేశారని తెలిపారు. దళితుల అభ్యున్నతి కోసం ఎన్నో పోరాటాలు చేసిన ఘనత వెంకట స్వామికి దక్కుతుందన్నారు. ఆయనను ప్రతి ఒక్కరూ కాకా పిలుచుకునే వారని,



ఆయనను ఎంతగానో గౌరవించే వారిని అన్నారు. అనంతరం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో పలువురికి పండ్ల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు బలిజ పద్మ, మోర్తాడ్ లక్ష్మీనారాయణ, గంధం గంగాధర్, బద్ది సుజాత మురళి, సంఘ రాష్ట్ర నాయకులు, ఉయ్యాల నరసయ్య, బలిజ రాజారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ఉయ్యాల శోభన్, నాయకులు పసుల కృష్ణ ప్రసాద్, పసుల రాంప్రసాద్, సిరికొండ (పోతారం) రాములు, సామల వేణుగోపాల్, పసుల చిన్నయ్య, గోరుమంతుల నారాయణ, మారంపల్లి నరసయ్య, బలిజ శివ ప్రసాద్, పలువురు అంబేద్కర్ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## పారిశుధ్య కార్మికులకు కంటి పరీక్షలు

జమ్మికుంట అక్టోబర్ 05 (ప్రజామంటలు):
స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమములో భాగంగా జిల్లా కలెక్టర్ మరియు జిల్లా వైద్యాధికారి మరియు హుజురాబాద్ డిప్యూటీ డి.ఎం.హెచ్.ఓ. ఆదేశాల మేరకు జమ్మికుంట మండల పరిధిలో గల ప్రతి గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు మరియు గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రత్యేక కంటి పరీక్షలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వావిలాలలో నిర్వహించడం జరిగినది అని డాక్టర్ సంధ్యారాణి తెలిపినారు. పారిశుధ్య కార్మికులకు కంటి లోపల ఉన్న కంటి సమస్యలను గుర్తించి క్యాట రాక్ట్ మరియు కంటి పొరల సమస్యలు ఉన్న వాళ్లకు ఆపరేషన్ కి రెఫర్ చేయడం జరిగినది. ఈ కార్యక్రమములో డాక్టర్ సంధ్యారాణి, పారామెడికల్ ఆప్తాల్ మిక్ ఆఫీసర్ జెలెందర్, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి, హెల్త్ సూపర్ వైజర్ సదానందం, పంచాయతీ కార్యదర్శి రాము రాజశ్రీధర్ ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్ రామక్రిష్ణ మరియు మణి, మల్లేశ్వరి ఆశాకార్యకర్తలు మరియు పారిశు ధ్య కార్మికులు పాల్గొన్నారు.

# సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన ఒంటెల కాపరి

## సౌదీ ఎడారి నుంచి స్వదేశానికి చేరిన నిర్మల్ జిల్లా వాసి

కోరుట్ల అక్టోబర్ 05 (ప్రజామంటలు):
కువైట్, సౌదీ అరేబియా సరిహద్దుల్లోని ఎడారిలో ఒంటెల కాపరిగా కష్టాలు అనుభవించిన నిర్మల్ జిల్లావాసి రాథోడ్ నాందేవ్ సీఎం. రేవంత్ రెడ్డి చొరవతో ఇటీవల రియాద్ నుంచి హైదరాబాద్ కు క్షేమంగా చేరుకున్నాడు. మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ ఈరవత్రి, కాంగ్రెస్ ఎన్నారై సెల్ నాయకులు మంద భీంరెడ్డి, చెన్నమనేని శ్రీనివాస రావు, స్వదేశ్ పరికిపండ్ల, నంగి దేవేందర్ లతో పాటు గల్ఫ్ బాధితుడు రాథోడ్ నాందేవ్ తన కుటుంబ సభ్యులతో శనివారం ముఖ్యమంత్రి. రేవంత్ రెడ్డిని హైదరాబాద్ లోని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నిర్మల్ జిల్లా ముధోల్ మండలం రూవి గ్రామానికి చెందిన రాథోడ్ నాందేవ్ అనే గిరిజనుడు ఇంటిపని వీసాపై కువైట్ వెళ్లాడు. అరబ్బు యజమాని అతన్ని కువైట్ నుంచి అక్రమంగా సౌదీకి తరలించి ఒంటెల కాపరి పని చేయించాడు. యజమాని హింసను తట్టుకోలేకపోతున్నాను, నిత్యం నరకం అనుభవిస్తున్నాను, ఎడారి నుంచి నన్ను రక్షించండి అంటూ రాథోడ్ నాందేవ్ ఆగస్టులో సీఎం రేవంత్ రెడ్డిని వేడుకుంటూ కన్నీరుమున్నీరుగా విలపిస్తూ పంపిన ఒక సెల్ఫీ వీడియో సామాజిక మాధ్యమాల్లో సంచలనం సృష్టించింది. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల



మేరకు తెలంగాణ జీఏడీ ఎన్నారై శాఖ అధికారులు, అనిల్ ఈరవత్రి తో కలిసి కువైట్, సౌదీ అరేబియా రెండు దేశాల్లోని ఇండియన్ ఎంబసీలతో, అక్కడి సామాజిక సేవకులతో, ఢిల్లీలోని విదేశాంగ శాఖతో సమన్వయము చేసి నాందేవ్ ను రక్షించి స్వదేశానికి వచ్చేలా చేశారు. సౌదీ అరేబియా తెలుగు అసోసియేషన్ (సాటా) బృందం కృషి అభినందనీయం.

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక "బతుకమ్మ పండుగ"



జనగామ అక్టోబర్ 05 (ప్రజామంటలు):
ప్రభుత్వ జూనియర్ కళాశాల ధర్మకంచ, జనగామలో కళాశాల ప్రిన్సిపాల్ నాముని పావని కుమారి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... తెలంగాణ అస్తిత్వానికీ, సాంస్కృతిక జీవనానికి ప్రతీక.. బతుకమ్మ పండుగ. ప్రకృతిలో లభించే పువ్వులను ఆరాధించే పండుగే బతుకమ్మ అని అన్నారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులకు, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల అధ్యాపక బృందం, భోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొని ఆట, పాటలతో అలరించారు.

## ఘనంగా గడ్డం వెంకటస్వామి 95వ జయంతి వేడుకలు



జనగామ అక్టోబర్ 05 (ప్రజామంటలు):
జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా యూత్, స్పోర్ట్స్, టూరిజం శాఖ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అధ్యక్షతన మాజీ కేంద్ర మంత్రి, పార్లమెంట్ సభ్యులు గడ్డం వెంకటస్వామి 95వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గడ్డం వెంకటస్వామి చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ఓ వెంకట్ రెడ్డి, డీఏఓ రామారావు నాయక్, బీసీ వెల్ఫేర్ అధికారి రవీందర్, జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారిణి చౌడేశ్వరి, డీఎంహెచ్ఓ రవీందర్ గౌడ్, ఇతర జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## దుర్గా దేవి సన్నిధిలో మహా అన్నప్రసాదం

కొడిమ్యాల అక్టోబరు 05 (ప్రజామంటలు):
జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రము, మరియు వివిధ గ్రామాల్లో దుర్గాదేవి నవరాత్రులు ఘనంగా యువకులు, హనుమాన్ సేవా సమితి, వందేమాతరం ఫ్రెండ్స్ యూత్, జయ దుర్గా సేవా సమితి, తదితర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మంటపాల వద్ద పూజలు నిర్వహించారు. వందే మాతరం ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో శనివారం మూడవ రోజు దుర్గాదేవీ భక్తులకు అన్నపూర్ణదేవీ రూపంలో దర్శనం ఇచ్చారు. అనంతరం యాల్ల మహిపాల్ రెడ్డి కుటుంబం దాదాపు 600 మందికి మహా అన్న ప్రసాదం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు కొమురవెల్లి రాకేష్, బైరి రవి, ఏనుగు ఆదిరెడ్డి, బైరి వెంకటి, వందే మాతరం ఫ్రెండ్ యూత్ సభ్యులు, భవానీ మాతలు, భక్తులు ,ప్రజలు పాల్గొన్నారు.



జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ను వారి నివాసం లో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేసిన జగిత్యాల పట్టణ ఎస్సై గా బాధ్యతలు స్వీకరించిన కిరణ్

# భూముల లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం(ఎల్ఆర్ఎస్)

### సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి

### కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్ ల ఏర్పాటు

### కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా




జనగామ అక్టోబర్ 05 (ప్రజామంటలు):
భూముల లేఅవుట్ క్రమబద్ధీకరణకు సంబంధించి దాఖలైన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం, జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా మున్సిపాలిటీ కి సంబందించిన ఎల్ఆర్ఎస్ సర్వే ప్రక్రియ వేగవంతం కోసం చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత రెవెన్యూ, నీటిపారుదల, మునిసిపల్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించుకొని, దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు చేయాలన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిష్కరించే ముందు అవి ప్రైవేటు స్థలమేనా (లేక) ప్రభుత్వ స్థలమా అనేది నిర్ధారించుకోవాలన్నారు. క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లడానికి ముందే దరఖాస్తుదారులకు సమాచారం అందిస్తే, వారు ప్లాట్ స్థలంలో అందుబాటులో ఉంటారన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారు. కలెక్టరేట్ లో, ఆర్డీఓ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేయాలన్నారు. జనగాం మున్సిపాలిటీ కి సంబందించి(12,552) అప్లికేషన్ లు వచ్చాయని, ఇందులో 144 అప్లికేషన్ లకు చెందిన సర్వే పూర్తయ్యిందని, మొత్తం ఎల్ఆర్ఎస్ ప్రక్రియ డిసెంబర్ లోగా పూర్తికావాలని సూచించారు. ఏ సర్వే నంబర్ కు ఎక్కువ అప్లికేషన్ లు ఉంటాయో అక్కడికి మున్సిపల్, ఇరిగేషన్, రెవిన్యూ బృందం అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి, పరిశీలించాలన్నారు. అలాగే ఎల్ఆర్ఎస్ కు వచ్చిన సర్వే నంబర్ లన్నీ క్రమ పద్ధతిలో ట్రాకింగ్ షీట్ ఒకటి పెట్టుకొని, ఎంత మంది దరఖాస్తుదారులు స్పందించారు, బృంద సందర్శన ఎప్పుడు అయ్యింది, పేమెంట్ అయ్యిందా? లేదా? తదితర వివరాలన్నీ ఎప్పటికప్పుడు ఆ ట్రాకింగ్ షీట్ లో నమోదు చేసుకుంటేనే ప్రతి రోజూ ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పర్యవేక్షణ పక్కాగా జరిగి, ఎల్ఆర్ఎస్ పూర్తవ్వడానికి దోహదపడుతుందన్నారు. ఈ సమీక్ష సమావేశంలో జనగామ ఆర్డీఓ కొమురయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్, నీటిపారుదల, పంచాయతీ శాఖకు సంబంధించిన అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ మహిళ ఉద్యోగినిల బతుకమ్మ సంబరాలు

జగిత్యాల అక్టోబర్ 04 (ప్రజామంటలు):
జిల్లాలోని విద్యుత్ సంస్థ లోని మహిళా ఉద్యోగినిలు అందరూ కలిసి, విద్యుత్ ప్రగతి భవన్, ఎస్ ఈ ఆఫీస్ ఆవరణలో బతుకమ్మ సంబరాలు, ఆట పాటలతో ఘనం గా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఈ జిల్లాలోని, మహిళలందరికి, బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ఈ. సాలియా నాయక్, ఎస్ఈ, జగిత్యాల, తిరుపతయ్య, ఎస్ఏఓ, రాజిరెడ్డి, డిఈ, జగిత్యాల గంగారామ్, డి ఈ, టెక్నికల్, తిరుపతి, డిఈ, మెట్టుపల్లి, రవీందర్, డి.ఈ, ఎంఆర్ టి , నగేష్ కుమార్, ఏడి ఈ, టెక్నికల్, లక్ష్మణ్, ఏఓ, జిల్లాలోని ఏడిఈ లు, ఏఈ లు, ఏఏఓ లు, ఫొరెమెన్ లు, ఎస్ఎల్ఐ లు, మరియు ఇతర అధికారులు, విద్యుత్ సిబ్బంది ఉత్సాహముగా పాల్గొన్నారు.





జగిత్యాల జిల్లా కేంద్రం గోవిందపల్లెలో కొలువైన నవదుర్గ పీఠక్షేత్రాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన ధర్మపురి శాసనసభ్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్. వీరి వెంట గొల్లపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నిశాంత్ రెడ్డి మరియు నాయకులు పాల్గొన్నారు.

# తంగేడు పూలను అందంగా పేర్చి బతుకమ్మ ఆడిన ఏకెవిఆర్ విద్యార్థులు

భీమదేవరపల్లి అక్టోబర్ 04 (ప్రజామంటలు) : తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు విలువనిస్తూ, తంగేడు పూలతో జరుపుకునే బతుకమ్మ వేడుకలు ముల్కనూర్ లోని ఏకెవిఆర్ జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి పసుపుతో మందు కాకుండా తయారు చేసిన గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.




కళాశాల విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి బతకమ్మ పాటలతో అలరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ భూపతి శ్రీకాంత్ మాట్లాడుతూ%%. తెలంగాణ సమాజానికి తరతరాలుగా వస్తున్న ఆచార సాంప్రదాయాలు నేటికీ కొనసాగడానికి ఏకైక కారణం బతుకమ్మ పండుగే అని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థిని విద్యార్థులు మరియు అధ్యాపక బృందం పాల్గొన్నారు.




# సనత్ నగర్ లో బీజేపీ సభ్యత్వ నమోదు

## హాజరైన రాష్ట్ర నాయకులు మర్రి పురూరవరెడ్డి

సికింద్రాబాద్ అక్టోబర్ 05 (ప్రజామంటలు): సనత్ నగర్ డివిజన్ నెహ్రూ పార్కు వద్ద శనివారం బీజేపీ డివిజన్ నాయకులు పి. వంశీకృష్ణ ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర బీజేపీ యువమోర్చా నాయకులు మర్రి పురూరవరెడ్డి హాజరయ్యారు. ఈసందర్బంగా స్థానికులకు బీజేపీ సభ్యత్వం ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అద్యక్షులు కే. క్రాంతి కుమార్, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు ఈ. దయానంద్, సీనియర్ నాయకులు నర్సింగ్ రావు, ఆకుల మహేశ్, శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ, చందు, అనుదీప్ రెడ్డి పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి టీచర్ ఓటరుగా నమోదు చేసుకోవాలి

## జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో మూడు ఓటరు నమోదు కేంద్రాల ఏర్పాటు-కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ అక్టోబర్ 05 (ప్రజామంటలు): భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం, వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎంఎల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హత కలిగిన ఉపాధ్యాయుల కోసం జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలో మూడు ఓటరు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖాధికారి కార్యాలయం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎల్‌ఏ, ఆర్‌ఆర్, యూనిట్ 1), మీడియా కేంద్రం (ఐడీఓసీ) లో అర్హత కలిగిన



అందరు ఉపాధ్యాయ ఓటర్లు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. అలాగే జిల్లాలో ఉపాధ్యాయులందరూ వంద శాతం ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా జనగామ, ఘనపూర్ (స్టేషన్) ఆర్డీఓ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాలు, ఎంఈఓ కార్యాలయాల్లో కూడా ఓటరు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఆయా మండలాల పరిధిలో అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఈ ఓటరు నమోదు కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.


# ఘనంగా కాక వెంకటస్వామి జయంతి వేడుకలు

గొల్లపల్లి అక్టోబర్ 05 (ప్రజామంటలు): గొల్లపల్లి మార్కెట్ యార్డ్ లో ఏఎంసీ చైర్మన్ భీమా సంతోష్ ఆధ్వర్యంలో శనివారం మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి (కాక) 95వ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా బీమా సంతోష్ వెంకటస్వామి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు




అర్పించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.... తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమంలో వెంకటస్వామి కీలక పాత్ర పోషించారని, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం వెంకటస్వామి ఎంతో కృషి చేసారని గుర్తు చేశారు. ఒక సామాన్య కార్యకర్త నుండి కేంద్ర మంత్రిగా ఎదిగి పేద ప్రజల కోసం, బడుగు బలహీన వర్గాల కోసం నిరంతరం వెంకటస్వామి పాటుపడ్డారని అన్నారు ఈ కార్యక్రమం లో వైస్ చైర్మన్ పురపాటి రాజిరెడ్డి, పాలకవర్గ సభ్యులు కొక్కుల జలంధర్, నక్క రాజయ్య, చాడ సతయ్య, కట్ట లక్ష్మన్, మార్కెట్ కార్యదర్శి ఫైజోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# పుర ప్రముఖులు మహమ్మద్ గౌస్ మొహియుద్దీన్ మృతి



జనగామ అక్టోబర్ 5 (ప్రజామంటలు): జనగామ పట్టణ ప్రముఖులు విశ్రాంత ఉపాధ్యాయులు, లయన్స్ క్లబ్ జనగామ ఆబాద్ చార్టర్ సభ్యుడు, పూర్వ రీజియన్ చైర్మన్ లయన్ మహమ్మద్ గౌస్ మొహియుద్దీన్ (72) మృతి చెందారు. కొద్ది రోజులుగా అస్వస్థతతో ఉన్న గౌస్ భాయి శనివారం తెల్లవారుజామున హైదరాబాద్ ఆసుపత్రిలో తుది శ్వాస విడిచారు. వారి పార్థివ దేహం ఉదయం 9 గం. ల వరకు జనగామ బాలాజీ నగర్ లోని వారి స్వగృహానికి తీసుకురాగా బంధుమిత్రులు, స్నేహితులు అంతిమంగా సందర్శించి నివాళులర్పించారు. ప్రస్తుతము ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జనగామ మేనేజింగ్ కమిటీ సభ్యునిగా కొనసాగుతున్నారు. ఇవాన్ డగ్లస్ ఎయిడెడ్ పాఠశాలలో హిందీ పండిట్ గా పనిచేసి ముందస్తు పదవీ విరమణ చేసిన గౌస్ పట్టణంలో రెండు దశాబ్దాల క్రితం చైతన్య జూనియర్ కళాశాల స్థాపించి విద్యారంగంలో సేవ చేసారు. జనగామ పట్టణము హైదారాబాద్ రోడ్డుకు గల బిళాల్ మసీద్ పాలకమండలి అధ్యక్షునిగా ఎన్నికయి రెండు పర్యాయాలు సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించి ఆధ్యాత్మిక రంగంలోనూ ప్రశంసలందుకున్నారు. ఆయన గృహం నుండి అంతిమ యాత్ర బయలు దేరి గిర్నిగడ్డ ఖబరస్థాన్ లో ఖననం తో అంత్యక్రియలు ముగిశాయి. సేవా రంగములో కలిసి పని చేసిన ఆత్మీయ సోదరుడు గౌస్ మొహియుద్దీన్ ఆత్మకు శాంతి చేకూరాలని, దుఃఖిత కుటుంబ సభ్యులకు ఓదార్పు కలిగించాలని భగవంతున్ని ప్రార్థిస్తూ లయన్స్ సమాజంలోని అనేక మంది నాయకులు, పురప్రముఖులు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. దివంగత గౌస్ మొహియుద్దీన్ కు భార్య ఖమరున్నీస, కుమారులు మహమ్మద్ గయాస్, మహమ్మద్ ఆవేస్, మహమ్మద్ సజ్జాద్, కుమార్తెలు ఫరహత్, డా. మున్నవర్ ఉన్నారు. జనగామ పట్టణము లో అందరివాడుగా మెదిలి దివంగతుడైన మహమ్మద్ గౌస్ మొహియుద్దీన్ మృతి పట్ల విచారం వ్యక్తం చేసి శ్రద్ధాంజలి ఘటించిన వారిలో లయన్స్ జిల్లా గవర్నర్ కుందూరు వెంకట్ రెడ్డి, వైస్ జిల్లా గవర్నర్ లు డా. చంద్రశేఖర్ ఆర్య, ఎన్. సుధాకర్ రెడ్డి, పూర్వ జిల్లా గవర్నర్లు కన్న పరశురాములు, కొత్తపల్లి జాన్ బన్నీ, రెడ్ క్రాస్ సొసైటీ జనగామ జిల్లా చైర్మన్ డా. డి. లవకుమార్ రెడ్డి, జిల్లా క్యాబినెట్ కార్యదర్శి సయ్యద్ హబీబ్, జిల్లా చైర్మన్లు పి. హరికిషన్ రెడ్డి, ఆర్ . రమణారెడ్డి, మహ్మద్ ఖాజా మొహియుద్దీన్, రీజియన్ చైర్మన్ కలువల భాస్కర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వై. సుధాకర్, విద్యాసంస్థ ల నాయకులు ఇ. ప్రభాకర్ రెడ్డి, చిర్రా ఉపేందర్ రెడ్డి, బార్ అసోసియేషన్ నాయకులు వి. ప్రసాద్ రావు, ఏ. బిక్షపతి, పుర ప్రముఖులు డా. చంద్రగిరి రాజమౌళి, స్వామి, జనగాం సోమిరెడ్డి, ఫజ్జూరి లక్ష్మినర్సయ్య, కే. రాజశేఖర్ రెడ్డి, పకీర్ యాదగిరి రెడ్డి, ఎం.డి. దస్తగిరి, ఎం.డి. అబ్దుల్లా, జమాల్ షరీఫ్, మాజీద్ అఫ్సర్, అల్లాడి ప్రభాకర్ రావు, నాగబండి రవీందర్, జి. ప్రమోద్ కుమార్ గుప్త, కృష్ణా జీవన్ బజాజ్ తదితరులున్నారు.



జనగామ జిల్లా అక్కరాజుపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన మంచినీళ్ల శాంతమ్మ, బొల్లు మార్కండేయ కుటుంబాలను రెయిన్బో యూత్ అధ్యక్షులు అంకం రాజు, సభ్యులు పరామర్శించి శాంతమ్మ కుటుంబానికి 5వేలు, బొల్లు మార్కండయ్య కుటుంబానికి 25కిలోల బియ్యం నిత్యవసర సరుకులు అందజేశారు. పాల్గొన్న ఉపాధ్యక్షులు జొన్నగోని రవీందర్ రాజు అనూప్ హరిప్రసాద్ అక్తర్ తరుణ్.

# సాయిబాబా గుడిలో దొంగలు హుండీతో సహా పరార్

## గతంలో జరిగిన సంఘటనలు పునరావృతం

భీమదేవరపల్లి అక్టోబర్ 05 (ప్రజామంటలు): ఎక్కడ ఏమి లేనివారికి దేవుడే దిక్కు అని అంటారు. కానీ దేవుడికే దిక్కులేని సంఘటన మండలంలోని కొత్తపల్లి గ్రామంలో సాయిబాబా గుడిలో చోటు చేసుకుంది. గతంలో ఇదే గుడిలో దొంగలు హుండీలను ఎత్తుకెళ్లి గ్రామ పరిసరాలలో పగలగొట్టి డబ్బులను దొంగిలించారు. మళ్లీ అదే తరహాలో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు హుండీ ఎత్తుకెళ్ళారు. యధావిధిగా హుండీని పగలగొట్టి హుండీలో ఉన్న మొత్తం సొమ్మును దొంగిలించారు. సీసీ కెమెరా రికార్డును పరిశీలించగా ఇద్దరు చోరులు దేవాలయ ప్రహరీ గోడ దూకుతుండగా, ఒక వ్యక్తి హెల్మెట్ ధరించి మరొక వ్యక్తి మాస్కు ధరించి ఉన్నారని సమాచారం. కానీ అన్ని తెలిసిన వారే ఈ దొంగతనానికి పాల్పడి ఉంటారని గ్రామస్తులు చెబుతున్నారు. ఎందుకంటే గతంలో కూడా జరిగిన సంఘటనలు ఇదేవిధంగా ఉండడంతో పలు అనుమానాలను గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నారు.



ఏది ఏమైనా నిఘా నేత్రాలకు దొరకకుండా దొంగలు సాంకేతిక పరిజ్ఞానంతో బయటపడుతున్నారు. దొంగలను ఆ దేవుడే గుర్తు పట్టి వారికి తగిన శిక్ష విధిస్తాడని ఆస్తికులు నమ్ముతున్నారు. క్లూస్ టీం పరిసరాలు పరిశీలించి ఆధారాలు సేకరిస్తున్నారని సమాచారం.



## సంస్కృతాంధ్ర కళాశాలకు కంప్యూటర్ అందించిన స్వశోధన్ ట్రస్ట్, హైదరాబాద్

ధర్మపురి అక్టోబర్ 05 (ప్రజామంటలు):

స్వశోధన్ ట్రస్ట్ హైదరాబాద్ ద్వారా ధర్మపురి లోనీ సంస్కృతాంధ్ర కళాశాలకు డొనేట్ చేసిన కంప్యూటర్ మరియు ప్రింటర్ ను శనివారం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా కళాశాల యాజమాన్యానికి అందజేశారు. ఈ సందర్భంగా కంప్యూటర్ మరియు ప్రింటర్ ను అందజేసినందుకు స్వశోధన్ ట్రస్ట్ హైదరాబాద్ కి కళాశాల యాజమాన్యం ధన్యవాదాలు తెలిజేశారు. ధర్మపురిలోనీ సంస్కృతాంధ్ర కలశాలకు డొనేట్ చేసిన కంప్యూటర్ మరియు ప్రింటర్ ను శనివారం రోజున ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా కళాశాల యాజమాన్యానికి అందజేశారు. ఈ సందర్భంగా కంప్యూటర్ మరియు ప్రింటర్ ను అందజేసినందుకు స్వశోధన్ ట్రస్ట్ హైదరాబాద్ కళాశాల యాజమాన్యం ధన్యవాదాలు తెలిజేశారు.

## కీ.శే. గడ్డం వెంకటస్వామి సేవలు చిరస్మరణీయాలు

### కాకా జయంతి వేడుకల్లో విప్ లక్ష్మణ్ కుమార్



ధర్మపురి అక్టోబర్ 05 (ప్రజామంటలు):

పేద ప్రజలకు నిరంతరం అండగా, వారి సంక్షేమమే పరమావధిగా కాంగ్రెస్ వరిష్ఠ నేత గడ్డం వెంకట స్వామి చేసిన సేవలు చిరస్మరణీయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. దివంగత కేంద్ర మంత్రి కీ.శే. గడ్డం వెంకట స్వామి జయంతి సందర్భంగా శనివారం ధర్మపురి లోని స్థానిక నంది విగ్రహం వద్ద మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రం కోసం ఎన్నో ఉద్యమ పార్టీలు పనిచేస్తున్న సమయంలో వారికి అన్ని విధాలా అండగా ఉండి రాష్ట్రం వస్తే ప్రజల జీవితాల్లో మార్పు వస్తుందని భావించిన మహనీయుడు కాకా అని, సింగరేణి కాలరీస్ మూసివేస్తామని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేసిన సందర్భంలో, అప్పుడు కేంద్ర మంత్రి ఉన్న కాకా అప్పటి ప్రధాన మంత్రితో మాట్లాడి నిధులను విడుదల చేయించిన గొప్ప వ్యక్తి అని, హైదరాబాద్లో నిరుపేదలు గుడిసెలు వేసుకొని జీవనం కొనసాగిస్తుంటే వెంకట స్వామి అప్పటి ప్రభుత్వంతో పోరాడి ముఖ్యమంత్రితో మాట్లాడి సుమారు 70 వేల మంది నిరుపేదలకు పట్టాలను పంపిణీ చేయడం జరిగిందని, ఎవరికి ఎటువంటి కష్టం వచ్చిన ముందుండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసే మహనీయుడు కాకా అని ఆయన సేవలను కీర్తించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దినేష్, నాయకులు ప్రసాద్, రాజేశ్, నరేందర్, సుధాకర్, లక్ష్మణ్, శ్రీనివాస్, మొగిలి, సుముఖ్, సత్యనారాయణ, రఫీ, ప్రభాకర్, తిరుపతి, అశోక్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు

ఇబ్రహీంపట్నం అక్టోబర్ 05 (ప్రజామంటలు):

ఇబ్రహీంపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ముందస్తు బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. రంగు రంగుల పూలను సేకరించి బతుకమ్మను పేర్చి ఆటపాటలతో అడి పాడి బతుకమ్మను, గౌరమ్మను గంగమ్మ తల్లికి ఒడి కి చేర్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అసం సంజీవ్, మహిళా ఆద్యాపకురాల్లు అనూష, రజిత, కావ్య, వినీత, విద్యార్థిని విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

## రాజపల్లి లో యువకుడి హత్య పోలీసుల అదుపులో కుటుంబ సభ్యులు

జమ్మికుంట అక్టోబర్ 05 (ప్రజామంటలు):



హుజురాబాద్ మండలం రాజపల్లి గ్రామానికి చెందిన నోముల రాజు (30) శనివారం రాత్రి హత్యకు గురయ్యాడు. ఉదయం తల్లిదండ్రులైన నోముల చంద్రయ్య, ఎల్లమ్మలు ఇంటిముందుకు వచ్చి మా కుమారుడు లేవడం లేదని చుట్టుపక్కల వారికి తెలిపారు. వారు ఇంట్లోకి వెళ్లి చూడగా మంచంపై రాజు శవమై ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. హుజురాబాద్ ఏసీపీ శ్రీనివాస్ జి, టౌన్ సిఐ తిరుమల్ గౌడ్, ఎస్.ఐ. యూనస్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి నోముల రాజు హత్యకు గురైనట్లు గుర్తించారు. మంచంపై విగతజీవిగా ఉండగా అతని నుదిటిపై ఆయుధంతో కొట్టిన గాయాలు ఉన్నాయి. మంచం చుట్టూ రక్తం మరకలు ఉన్నాయి. గొడ్డలితో గాయపరిచి చంపి ఉంటారని పోలీసులు అనుమానించారు. మృతుని తల్లిదండ్రులు, సోదరుడు అంజిలను అదుపులోకి తీసుకొని పోలీసులు విచారిస్తున్నారు. నోముల రాజు గత కొంతకాలంగా మద్యం సేవిస్తూ తల్లిదండ్రులతో గొడవ పడుతుండేవాడని తెలిసింది. సోదరుడు అంజి హైదరాబాదులో కారు నడుపుతూ జీవిస్తున్నాడని గత నాలుగు రోజులుగా ఇంటి వద్దనే ఉంటున్నాడని స్థానికులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# చంద్రఘంటా మాత రూపంలో దుర్గామాత

(రామ కిష్టయ్య సంగన భట్ల)

ధర్మపురి అక్టోబర్ 05 (ప్రజామంటలు):

ధర్మపురి క్షేత్రంలో నిర్వహిస్తున్న శర న్నవరాత్రి ఉత్సవ వేడుకలలో భాగంగా మూడవ రోజైన శని వారం దుర్గామాత చంద్ర ఘంటా దేవి రూపధారిణియై ప్రత్యేక పూజలందుకున్నది.

**ప్రత్యేకతలు:**

దుర్గామాత తృతీయ స్వరూపం చంద్ర ఘంటా దేవి మాతగా ప్రసిద్ధిగాంచింది. నవరా త్ర్యుపాసనలో మూడవ నాడు ఈదేవినే కొలుస్తారు. ఈమె స్వరూపం పరమ శాంతిదాయ కమై, కళ్యాప్రదమైనది. ఈమె మస్తకంపై అంకారంలో చంద్రుడు అర్థాకృతిలో ఉం టాడు. స్వర్ణసమ శరీరంతో భాసిల్లుతుంది. ఈమె దశ హస్తాలలో దర్శనమిచ్చిన దుర్గామాత ఖడ్గాది శస్త్రాలు, బాణాది అస్త్రాలు రాజిల్లు తుంటాయి. సింహ వాహినియై ముద్ర సర్వదా యుద్ధోన్ముఖమై ఉంటుంది. ఘంటా సదృశమైన ఈమె చండ ధ్వనులకు అత్యాచారులైన దానవులు కంపిస్తారు. నవరాత్రులలో తృతీయ దినానికి ప్రత్యేకత ఉంది. మూడవ నాడు జరిగే పూజ సాధకుని మనస్సు, మణి పూర చక్రంలో ప్రతిష్ఠితమై ఉండి, దేవి కరుణ వల్ల సాధకునకు అలౌకిక వస్తు దర్శనమవుతుంది. దివ్య సుగంధానుభవం కలుగు తుంది. ఆమె కృపవల్ల సకల పాపాలన్నీ నశిస్తాయి. ఆరాధన సర్వఫల దాయక మవుతుంది. ఈమె ఆరాధన మాత్రం చేతనే సాధకునకు లభించే వీరత్వ లక్షణాలు నిర్భయాలతోపాటు సౌమ్యత్వ, వినమ్రత్వాలు లభిస్తాయి. మాత భక్తులు ఎక్కడికి వెళ్ళినా, వారిని చూసిన వారు సుఖశాంతులతో వర్ధిల్లుతారు. ఆ తల్లిని ఉపాసిం చడంతో సాంసారిక కష్టాలన్నీ విముక్తి పొందుతాయి. శ్రీరామ లింగేశ్వరస్వామి ఆలయంలో వేదపండితులు, ఋత్వికులచే మహా సంకల్పము, పృద్వీకలశ, గణపతి పూజ, స్వస్తిః పుణ్యాహ వచనము, ఋత్విక్ వరణము, అఖండ దీప స్థాపన, నవగ్రహ, వాస్తు, క్షేత్ర పాలక, యోగిని, అంకురారోపణ, మాతృక, సర్వతోభద్ర మండల పూజలతో ప్రధాన కలశ స్థాపనలు జరిగినవి. ఇందులో భాగంగా సప్తశతీ పారాయణము, అమ్మ వారికి చతుష్షష్ఠి పూజ, శ్రీచక్రమునకు కుంకుమార్చన, హారతి, మంత్ర పుష్పము, తీర్థప్రసాద వితరణలు జరిగినవి. కన్యకా, సువాసిని పూజలు జరిగినవి. అమ్మ వారు "చంద్రఘంట" రూపములో గులాబి రంగు చీరలో మల్లెపూలు, బిల్వపత్రి దండలు ధరించి భక్తులకు దర్శనం ఇచ్చినది.



దేవస్థాన ఈఓ ఎస్.శ్రీనివాస్, వేదపారాయణ దారులు బొజ్జ రమేష్ శర్మ, సిహెచ్. ముత్యాల శర్మ, పాలెపు ప్రవీణ్ శర్మ, ఉపప్రధాన అర్చకులు నేరళ్ళ శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచార్యులు, అర్చకులు ద్యావళ్ళ విశ్వనాథ శర్మ, బొజ్జ సంతోష్ కుమార్, బొజ్జ సంపత్ కుమార్, బొజ్జ రాజగోపాల్ శర్మ, భరత్ శర్మ, ఋత్వికులు నంబి అరుణ్ కుమార్, పాలెపు సందీప్ శర్మ, ద్యావళ్ళ సాయి శర్మ, అర్చకులు, సిబ్బంది భక్తులు పాల్గొన్నారు. సాయంత్రము శ్రీ యోగ, ఉగ్ర నృసింహస్వామి వార్ల ఊరేగింపు సేవ "శేషవాహనంపై గ్రామములోని పురవీధులలో తిరిగి దేవాలయమనకు తెచ్చారు. రాత్రి అమ్మవారికి షోడషోపచార పూజతో మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ గావించారు.

**నవదుర్గ సన్నిధిలో ప్రత్యేక పూజలు:**

నూతన తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపంలో గత 10 సంవత్సరాలుగా నవదుర్గ సేవా సమితి ధర్మపురి ఆధ్వర్యంలో లోక కళ్యాణార్థమై నిర్వహించే శ్రీ దుర్గా శరన్నవరాత్రోత్సవాలలో భాగంగా మూడవ రోజు అమ్మవారిని శ్రీ చంద్ర ఘంటా దుర్గా అలంకరణ రూపంలో పూజలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా చతుష్షష్టి పూజ, మంత్రపుష్పం, మంగళ నీరాజనం విశేష పూజలను వేద పండితులు కాసర్ల వంశీకృష్ణ శర్మ అర్చకత్వంలో జన్మంచి వంశీకృష్ణ, కసోజ్జుల బాలకృష్ణ శర్మ లు నిర్వహించారు. నర్మదేశ్వర మందిరంలో పాలె పు చంద్రమౌళి శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## చాణక్య డిగ్రీ కళాశాలలో వైభవంగా బతుకమ్మ సంబరాలు

### బతుకమ్మ పాటలతో అలరించిన విద్యార్థినీలు

జమ్మికుంట అక్టోబర్ 05 (ప్రజామంటలు):

జమ్మికుంట పట్టణంలోని చాణక్య డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కళాశాల కరస్పాండెంట్ దబ్బేట విజయ-రవీందర్ మాట్లాడుతూ.... మహిళలకు అతి ఇష్టమైన పండుగ బతుకమ్మ అని, బతుకమ్మను తీరు తీరు పువ్వులతో అలంకరించి, నైవేద్యం పెట్టి కొలుస్తారని అని అన్నారు. ఆడపడుచులు తొమ్మిది రోజులు తొమ్మిది రకాల నైవేద్యాలు వండి బతుకమ్మకు సమర్పించి, వివిధ రకాల బతుకమ్మ పాటలతో కొలుస్తారని తెలిపారు.. కళాశాలలో ప్రతి పండుగ విశిష్టత విద్యార్థులకు తెలియజేయడానికి కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు..ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు ప్రభాకర్, శ్రీనివాస్, విజేందర్ రెడ్డి, చిరంజీవి, శివ, కళాశాల ప్రిన్సిపాల్ వంశీకృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు సాయికృష్ణ, సతీష్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

### కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగరావు

ఇబ్రహీంపట్నం అక్టోబర్ 05 (ప్రజామంటలు):



ఇబ్రహీంపట్నం మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగరావు అన్నారు. ఈ సందర్భంగా శనివారం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నర్సింగారావు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడా శ్రీకాంత్ రెడ్డి తో కలిసి పరిశీలించారు. ఈ మేరకు నర్సింగారావు మాట్లాడుతూ మండల ప్రజల అభీష్టం మేరకు ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలపై డాక్టర్ హరీష్ ను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో మరుగుదొడ్లు లేక రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమస్యను, అదేవిధంగా హాస్పిటల్లో ఒకటి స్టాఫ్ నర్స్, 9 మంది ఏఎన్ఎంలు, ఇద్దరు మెడికల్ ఆఫీసర్ లు, ఒక ల్యాబ్ టెక్నీషియన్ అవసరం ఉందని అదేవిధంగా ఆస్పత్రి ఆవరణ పిచ్చి మొక్కలతో నిండి ఉన్న సమస్యను నరసింగారావు దృష్టికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు తీసుకువచ్చారు. సమస్యలను సానుకూలంగా విన్న నర్సింగారావు ఆస్పత్రిలో ని మరుగుదొడ్ల మరమ్మత్తులు, ఇతర సమస్యలను రోగులకు ఇబ్బంది కలగకుండా సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయించి దసరా తర్వాత పది పదిహేను రోజుల లోపల సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. ఓపి పేషంట్ల రిజిస్టార్ ను చూసిన నర్సింగరావు రోజుకు వందమంది రోగులు హాస్పిటల్ లో వైద్యం చేయించుకుంటున్నారని, 24 గంటలు వైద్యం అందించాలంటే అందుకు తగ్గట్టుగా స్టాఫ్ ను భర్తీ చేసే విధంగా స్టాఫ్ నర్స్, ఏఎన్ఎంలు, మెడికల్ ఆఫీసర్ కొరతను కలెక్టర్ దృష్టికి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహం దృష్టికి తీసుకువెళ్లి తొందర్లోనే ఖాళీలను భర్తీ చేసే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. రోగాలు దరిచేరకుండా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మండల ప్రజలకు నర్సింగారావు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు,వైస్ చైర్మన్ ఎలాల వెంకటరెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు దూదిగాం గంగాధర్, మాజీ ఎంపీటీసీ తిమ్మని రాములు, విండో చైర్మన్ బాస శ్రవణ్, నేరెళ్ల దేవేందర్ సుగుణాకర్ రావు, వేల్మూల శ్రీను, మాజీ జెడ్పిటిసిలు కొక్కు పురుషోత్తం, ఆకుల లింగారెడ్డి, డైరెక్టర్ తిపిరి అశోక్ కుమార్, నాచుపల్లి రాజు, మహిళా నాయకురాలు నర్సక్క, ఐలాపురం భూమారెడ్డి, కుంభాల రాజారెడ్డి, నల్ల రామరాజు, గడ్డం శంకర్ రెడ్డి కళ్లెం గంగారెడ్డి చల్ల పురుషోత్తం నల్ల రమేష్ వెంకటాద్రి రామానుజన్ ముత్తన్న గడ్డం శేఖర్ రెడ్డి రాజశేఖర్ యాదవ బండి రాజేష్ కట్ట మనోజ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## భోలక్ పూర్ లో నీటికి కటకట ఇబ్బందుల్లో బస్తీ వాసులు

సికింద్రాబాద్ అక్టోబర్ 05 (ప్రజామంటలు):



బన్సీలాల్ పేట డివిజన్ లోని న్యూ భోలక్ పూర్ హన్మాన్ ఆలయ పరిసర ప్రాంతాల్లో గత వారం రోజులుగా మంచినీటి సరఫరా సక్రమంగా లేక తాము నానా ఇబ్బందులు పడుతున్నామని స్థానిక బస్తీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోయిగూడ సెక్షన్ సిబ్బందికి ఫిర్యాదు చేయగా మారేడ్పల్లి డివిజన్ జనరల్ మేనేజర్ తమ సెక్షన్ కు తక్కువ నీరు కేటాయించడంతో ఈ సమస్య ఉందని చెబుతున్నారని వారు వాపోయారు. ఇప్పటికైన సంబందిత మెట్రో వాటర్ అధికారులు స్పందించి భోలక్ పూర్ ప్రాంతానికి సక్రమంగా నీటి సరఫరా చేయాలని కోరుతున్నారు.



గొల్లపల్లి మండల కేంద్రం, శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయంలో శ్రీ దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మూడవ రోజు చంద్ర గంట అమ్మవారిని కూరగాయలతో అలంకరణలో దర్శించుకున్న జగిత్యాల డిఎస్పీ రఘుచందర్, ఎస్సై సతీష్. ప్రత్యేక పూజలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పాల్గొన్న భవాని దీక్షాభవానీలు

# ముస్తఫాపుర్ లో బహుజన బతుకమ్మ పోస్టర్ ఆవిష్కరణ

భీమదేవరపల్లి అక్టోబర్ 04 (ప్రజామంటలు):
హుస్నాబాద్ నియోజకవర్గంలో జరిగే బహుజన బతుకమ్మను విజయవంతం చేయాలని, ఈ నెల 7న హుస్నాబాద్ లో జరిగే బహుజన బతుకమ్మ వేడుకలకి ప్రజలు పెద్దఎత్తున తరలి రావాలని మాడుగుల సంపత్ పేర్కొన్నారు. శనివారం భీమదేవరపల్లి మండలం ముస్తఫాపూర్ గ్రామంలో మహిళలతో కలిసి జేఏసి నాయకులు వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాడుగుల సంపత్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అరుణోదయ కళాబృందంచే ప్రజా గాయకురాలు విమలక్క బహుజనులను ఉద్దేశించి ఆనాటి బతుకమ్మ ఏ విధంగా ఉందో చాటి చెప్పడానికి 7వ తేదీన హుస్నాబాద్ పట్టణానికి రావడం జరుగుతుందని అన్నారు. మహిళల పైన పెరుగుతున్న అత్యాచారా లను నిరసిస్తూ, స్త్రీలు గౌరవంగా జీవించే హక్కును చాటి చెబుతూ బహుజనుల బతుకమ్మను ఊరు వాడల ఉద్యమంగా జరుపుకోవడం జరుగుతుందని అన్నారు.



హుస్నాబాద్ నియోజకవర్గ మహిళా సోదరిమణులు అధిక సంఖ్యలో పాల్గొని బహుజన బతుకమ్మను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాడుగుల సంపత్, ఎర్ర కార్తీక్, కొయ్యడ లలిత, రొంటాల గంగ, ఇల్లందుల సంపూర్ణ, జయ, ఎడ్ల శంకర్, మాడుగుల దయాకర్, ప్రభాస్, గూడూరు విజయ్, సిద్దమల్ల రామకృష్ణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల పట్టణంలోని రెడ్డి ఫంక్షన్ హాల్ లో రామకృష్ణ మరియు ఎన్.ఎస్.వి. విద్యాసంస్థల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్




జగిత్యాల అక్టోబరు 05 (ప్రజామంటలు):
జగిత్యాల పట్టణంలోని రెడ్డి ఫంక్షన్ హాల్ లో రామకృష్ణ మరియు ఎన్.ఎస్.వి. విద్యాసంస్థల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలలో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్. వారు మాట్లాడుతూ.... బతుకమ్మ పండుగ, తెలంగాణా సాంస్కృతిక చిహ్నం .. తొమ్మిది రోజుల పూల సంబరం తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచేది బతుకమ్మ పండుగ. తెలంగాణ ఆడపడుచులు అంతా సంబరంగా జరుపుకునే వేడుక. బంధాలను, అనుబంధాలను గుర్తు చేస్తూ, ప్రకృతిని ఆరాధిస్తూ, తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటి చెప్పే పండుగ బతుకమ్మ పండుగ. ఇదో పూల పండుగ, ప్రకృతిని పూజించే పండుగ. తొమ్మిది రోజుల పాటు ఆడి పాడి గౌరీ దేవిని అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించే తెలంగాణకే ప్రత్యేకమైన పూల సంబరం బతుకమ్మ పండుగ. బతుకమ్మ పండుగ జరుపుకోవడానికి ఉపయోగించే పూలకు కూడా ఒక విశేషం ఉంది. ఔషధ గుణాలు ఉన్న పువ్వులను బతుకమ్మలు గా పేర్చడం కోసం ఉపయోగిస్తారు. తంగేడు, గునుగు, బంతి, చేమంతి, కట్ల, సంపెంగ, మొల్ల, సీత జడలు, రుద్రాక్ష, పోక బంతి, మల్లె, మందార, మరువం, పారిజాతం, కమలం, తామర, గన్నేరు గుమ్మడి, గులాబీ, పట్టుకుచ్చులు పూలతో చక్కగా బతుకమ్మలను పేర్చి బతుకమ్మ సంబరాలను జరుపుకుంటారు. బతుకమ్మ సంబరాలలో భాగంగా మహిళలు చక్కగా ముస్తాబై అత్యంత భక్తి శ్రద్ధలతో తయారుచేసిన బతుకమ్మలను తీసుకొని ఆలయాలలో, వీధులలో అందరూ గుంపుగా కూడి సంబరాలు జరుపుకుంటారు. చిన్న, పెద్ద, ముసలి, ముతక తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఈ సంబరాలలో పాలుపంచుకుంటారు. తెలంగాణ సంస్కృతిని, తెలంగాణ గ్రామీణ జీవనాన్ని ప్రతిబింబించేలా జానపదాలను పాడుతూ ఈ పండుగ జరుపుకుంటా అన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ మరియు ఎన్ఎస్వి విద్యాసంస్థల బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# బెట్టింగులకు బలైన కుటుంబం

### - ఉరేసుకుని తల్లిదండ్రులు, కుమారుడి ఆత్మహత్య

### - నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలో ఘటన

ఎడపల్లి (ప్రజా మంటలు):




ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో అప్పులు ఎక్కువై మోయలేని భారంతో ఓ కుటుంబం బలైపోయింది. కుమారుడు చేసిన పనికి తల్లిదండ్రులు సైతం బలైపోయిన ఘటన నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం వడ్డాపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. వడ్డేపల్లి గ్రామానికి చెందిన రంగనేని. సురేష్ (53) భార్య హేమలత (45) కుమారుడు హరీష్ (22) గత 20 సంవత్సరాల నుండి వ్యవసాయంతో పాటు కిరాణా షాప్ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. తల్లిదండ్రులు నిరక్షరాస్యులు కావడంతో పెత్తనమంతా కుమారుడు హరీశ్‌కు అప్పగించారు. ఈ క్రమంలో కుమారుడు హరీశ్ ఆన్‌లైన్ బెట్టింగులకు అలవాటుపడి భారీగా అప్పులు చేయడంతో తల్లిదండ్రులు గతంలో తమ భూమిని అమ్మి కొంత అప్పులను చెల్లించారు. ఈ విషయంలో మాజీ సర్పంచ్ శ్రీధర్ హరీశ్‌కు పలుమార్లు సర్దిచెప్పాడు. అయినా అతడి తీరు మారకపోడంతో మళ్లీ బెట్టింగుల మాయలో పడ్డాడు. దీంతో రూ.18 లక్షలు అప్పులు కావడంతో ఇటు అప్పులు వారు ఓత్తిడి చేస్తుండటంతో మనస్తాపం చెంది శుక్రవారం అర్ధరాత్రి ముగ్గురు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. శనివారం ఉదయం పక్కన ఉన్న పొరుగువారు లేవకపోవడంతో డోర్ ను కొట్టిన తీయకపోవడంతో ఇంటి వెనకల ఉన్న కిటికీ గుండా చూడడంతో ముగ్గురు ఉరివేసుకొని ఉండటం గమనించి ఎడపల్లి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న బోధన్ ఎసిపి శ్రీనివాస్, రూరల్ సీఐ విజయ్ బాబు, ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణ రెడ్డి ఘటన స్థలం చేరుకొని, ఘటన స్థలాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించి మృతదేహాలకు పోస్టు మార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఓకే కుటుంబంలో ముగ్గురికి ముగ్గురు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకోవడంతో వడ్డాపల్లి గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

## అక్రమ ఇసుక తరలిస్తున్న 52 మంది, రిమాండ్ కు తరలింపు

### జమ్మికుంట పట్టణ సిఐ వరగంటి రవి

జమ్మికుంట అక్టోబరు 05 (ప్రజామంటలు):



విలాసాగర్ మానేరు వాగు ప్రాంతం నుంచి గత నెల 26న 4 టిప్పర్ల ద్వారా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న కాంట్రాక్టర్ మాధవరావును పట్టుకొనగా అతను ఇచ్చిన సమాచారం మేరకు మానేరు వాగు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 52మంది ట్రాక్టర్ ఓనర్లు డ్రైవర్ల పైన ఆదివారం రిమాండ్ కు తరలించినట్టు జమ్మికుంట పట్టణ సీఐ వరగంటి రవి తెలిపారు. వీరంతా మానేరు పరిసర గ్రామమైన విలాసాగర్, శంభునిపల్లి, పరిమళ కాలనీలలో ఇసుక డంపులను ఏర్పాటు చేసుకొని అక్కడినుండి జమ్మికుంట పరిసర గ్రామాలకు అక్రమంగా తరలిస్తున్నట్లు ఒప్పుకున్నారు. అక్రమంగా ఇసుకను తరలించినట్లయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు.





## హైదరాబాద్ కి షాన్.. తెలంగాణ కి జాన్..

### మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా కాక జయంతి వేడుకలు

జగిత్యాల అక్టోబరు 05 (ప్రజామంటలు):
పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా కాక జయంతి వేడుకలు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్ మాట్లాడుతూ..రాజకీయాల్లో విశిష్టమైన రాజకీయ శైలిని అవలంబించిన మహానేత ఆ రోజుల్లో దళితులు అంటేనే వివక్ష గురవుతున్న పరిస్థితులు తిండి గుడ్డ గూడు ఉంటే చాలు అనుకునే దళిత సమాజం నుంచి భారత రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్న గొప్ప నాయకుడు. బడుగుల అస్తిత్వం కోసం తన జీవితాంతం శ్రమించి. శ్రామికులు పేదలకు గూడు కల్పించేందుకు గుడిసెలు వేయించి తన ఇంటి పేరే గుడిసెల వెంకటస్వామి అనుకునేలా గొప్ప నాయకుడు మన. కార్మికులకు పెన్షన్ పథకం రూపొందించి అని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సమ్మయ్య మరియు మేనేజర్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# గంటల వ్యవధిలో 600 మందిని కాల్చిచంపిన మిలిటెంట్లు

### - ఆఫ్రికా దేశం బుర్కినా ఫాసోలో అత్యంత భయానక ఘటన

బర్సాలో (జనంసాక్షి):
పశ్చిమ ఆఫ్రికా దేశం బుర్కినా ఫాసోలో అత్యంత భయానక ఘటన చోటుచేసుకుంది. బర్సాలోగో పట్టణంలో ఉగ్రవాదులు కిరాతకానికి పాల్పడ్డారు.కొన్ని గంటల వ్యవధిలోనే దాదాపు 600 మందిని పిట్టల్ని కాల్చేసినట్లు కాల్చి చంపారు. ఆగస్టులో జరిగిన ఈ దారుణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించారు. మృతదేహాలను సేకరించేందుకే మూడు రోజులు పట్టిందట..!ఆగస్టు 24న బర్సాలోగో పట్టణంపై బైక్‌లపై దూసుకొచ్చిన ఉగ్రవాదులు కన్పించినవారిని కాల్చేశారు. మృతుల్లో అత్యధికులు మహిళలు, చిన్నారులే కావడం గమనార్హం. అల్‌ఖైదా, ఇస్లామిక్ స్టేట్ అనుబంధ సంస్థ జమాత్ నుస్రత్ అల్ ఇస్లామ్ వాల్ ముస్లిమిన్ (జేఎన్ఐఎం) మిలిటెంట్లు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. దాడులకు పాల్పడుతుండటంతో ప్రజల భద్రత దృష్ట్యా గ్రామాల చుట్టూ లోతైన కందకాలు తవ్వుకోవాలని అక్కడి మిలిటరీ ఆదేశించింది. దీంతో ఆగస్టు 24న బర్సాలోగో ప్రజలు తవ్వకాలు జరుపుతుండగా ఉగ్రవాదులు వారిని సైనికులుగా భావించి దాడికి పాల్పడ్డారు. ప్రాణభయంతో ప్రజలు పరుగులు పెట్టినా వెంటాడి మరి కాల్పులు జరిపారని ప్రత్యక్ష సాక్షులు చెప్పినట్లు కథనాలు వెల్లడించాయి. తొలుత ఈ ఘటనలో 200 మంది మరణించినట్లు ఐరాస అంచనా వేసింది. కానీ, దాదాపు 600 మంది ప్రాణాలు కోల్పోయినట్లు తాజాగా గణాంకాలు వెలువడ్డాయి.ఘటన తర్వాత మృతదేహాలను సేకరించేందుకు స్థానిక అధికారులకు మూడు రోజుల సమయం పట్టిందని ఓ ప్రత్యక్ష సాక్షి వెల్లడించారు.

ఈ దాడి తర్వాత బుర్కినా ఫాసో వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగాయి. కానీ, వారిని సైన్యం అణచివేసినట్లు తెలుస్తోంది. ఈ దేశంలో రెండుసార్లు సైన్యం తిరుగుబాటు చేసిన తర్వాత 2022లో పాలన మిలిటరీ జుంటా చేతుల్లోకి వచ్చింది. అప్పటి నుంచి ఇలాంటి ఊచకోతలు తరచూ జరుగుతున్నాయి. గతంలో మిలిటెంట్లకు సహకరిస్తున్నారని ఆరోపిస్తూ రెండు గ్రామాల్లోని దాదాపు 200 మందికి పైగా పౌరులను సైన్యమే కాల్చి చంపడం గమనార్హం.



## పదినెలలపాలన విజయవంతం

### - ఆర్థిక ఇబ్బందులు అధిగమించి హామీలు నెరవేస్తున్నాం
### - వరద నష్టం రూ.10వేల కోట్లైతే రూ.400 కోట్లిచ్చి చేతులు దులుపుకున్న కేంద్రం
### - భాజపా, భారాస రెండు పార్టీలు ఒకటే..
### - మంత్రి వ్యాఖ్యలు ఉపసంహరించుకున్నాక.. సినిమా వాళ్లు స్పందించడం సరికాదు
### - మంత్రి పొన్నం

హైదరాబాద్, (ప్రజా మంటలు):
కాంగ్రెస్ ప్రభుత్వం 10 నెలల పాలన విజయవంతంగా సాగిందని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఆర్థిక ఇబ్బందులు అధిగమించి హామిలు నెరవేస్తున్నామన్నారు. "రైతుల పేరుతో మొన్న భాజపా.. నేడు భారాస ఆందోళనకు దిగాయి. ఆ రెండు పార్టీలు ఒకటే.. అందుకే ఒకరి తర్వాత ఒకరు ఆందోళన చేశారు. వరద నష్టం రూ.10వేల కోట్లు జరిగితే.. కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది కేవలం రూ.400 కోట్లు. మంత్రి కొండా సురేఖ విషయంలో సంయమనం పాటించాల్సి ఉంది. ఆమె వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నాక సినిమా వాళ్లు స్పందించడం సరికాదు. వ్యాఖ్యలను మంత్రి వెనక్కి తీసుకున్నాక సమస్య ముగిసినట్టే. బలహీనవర్గాల మహిళా మంత్రి ఒంటరి కాదు" అని పొన్నం ప్రభాకర్ అన్నారు.

# ఇరాన్ అణుస్థావరాలపై దాడులు చేయాలి

### - ఇజ్రాయెల్‌కు ట్రంప్ సూచన

న్యూయార్క్ (ప్రజామంటలు):
ఇరాన్– ఇజ్రాయెల్ మధ్య యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈనేపథ్యంలో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు.ఇరాన్ అణుస్థావరాలను ఇజ్రాయెల్ ధ్వంసం చేస్తుందని తాను భావిస్తున్నానని పేర్కొన్నారు. నార్త్ కరోలినాలోని ఫయెట్‌విల్లేలో జరిగిన ప్రచార కార్యక్రమంలో ఆయన ఈమేరకు వ్యాఖ్యానించారు.ఇరాన్ అణు కేంద్రాలను ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకుందనే అంశంపై ఇటీవల అమెరికా అధ్యక్షుడు జోబైడెన్‌ను ఓ విలేకరి ప్రశ్నించారు. ఆ ప్రశ్నకు బైడెన్ స్పందించలేదు. ఈ క్రమంలో ట్రంప్ బైడెన్ వైఖరిని తప్పుబట్టారు. 'ఇరాన్ ఇటీవల ఇజ్రాయెల్‌పై జరిపిన క్షిపణి దాడులకు ప్రతిస్పందనగా.. ఇరాన్ అణుస్థావరాలను ధ్వంసం చేయాలి. ఆ తర్వాత వాటి గురించి చింతించాలి' అని ట్రంప్ పేర్కొన్నారు.ఇరాన్ చమురు కేంద్రాలపై కాకుండా ఇజ్రాయెల్ ప్రత్యామ్నాయం ఆలోచించాలని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ పేర్కొన్నారు. వైట్‌హౌస్ వద్ద విలేకరులతో ఆయన ఈమేరకు వ్యాఖ్యానించారు. 'ఇజ్రాయెల్ యుద్ధం విషయంలో ఓ నిర్ణయానికి రాలేకపోతుంది. ఆ విషయంపై ఇంకా చర్చలు కొనసాగుతున్నాయి. నేను వారి స్థానంలో ఉంటే చమురుకేంద్రాలపై దాడికి బదులు ప్రత్యామ్నాయాల గురించి ఆలోచిస్తాను' అని బైడెన్ పేర్కొన్నారు. అమెరికా ఎన్నికల్లో ఇజ్రాయెల్ ప్రభావితంపై స్పందిస్తూ.. ఇజ్రాయెల్‌తో సంబంధాలు అమెరికా ఎన్నికలపై ప్రభావితం చూపుతాయో, లేదో తనకు తెలియదని బైడెన్ వెల్లడించారు. యుద్ధం నేపథ్యంలో ఇజ్రాయెల్‌కు తానే ఎక్కువ సాయం అందించినట్లు పేర్కొన్నారు. అమెరికాలో వచ్చే నెలలో అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అధ్యక్షుడు జో బైడెన్ కీలక వ్యాఖ్యలు చేశారు. నవంబరులో జరిగే ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతాయని తాను విశ్వసించడం లేదని వ్యాఖ్యానించారు. 'ఈ ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా ఉంటాయని నేను విశ్వసిస్తున్నాను. అయితే, అవి ప్రశాంతంగా జరుగుతాయా, లేదా అనేది తెలియదు. గత ఎన్నికల్లో ట్రంప్‌కు అనుకూలంగా ఫలితాలు వెలువడకపోవడంతో ఆయన చేసిన ప్రమాదకరమైన వ్యాఖ్యలే అందుకు కారణం' అని బైడెన్ పేర్కొన్నారు.

DIGITALLY PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AT 6-3-144, bRAHMAN WADA, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com